ప్రజాశక్తి

శనివారం 25 జనవరి 2025 · 8 పేజీలు

ఎన్‌టిఆర్ · కృష్ణా

ఒత్తిళ్లు... వసూళ్లు

- పన్ను బకాయిదారులకు అధికారుల హెచ్చరికలు
- పన్ను వసూళ్లలో పురోగతి
- ఆదాయంలో బందరు కన్నా తాడిగడప మిన్న

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

నగరపాలక సంస్థ, మున్సిపాల్టీల్లో అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ తదితర అవసరాలకు ప్రభుత్వాల నుంచి రావాల్సిన గ్రాంట్లు తగ్గిపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే గతంలో ఎన్నడూ లేని విధంగా కృష్ణాజిల్లా కేంద్రం బందరు నగరపాలక సంస్థతో పాటు మిగిలిన నాలుగు మున్సిపాల్టీల్లోనూ ఆస్తి పన్ను వసూళ్లకు ఒత్తిడిలు అధికమయ్యాయి. ఆస్తి పన్ను బకాయిలు చెల్లించని వారి ఇంటి విద్యుత్ కనెక్షన్‌లు తొలగిస్తామని బందరు నగరపాలక సంస్థ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 48,272 ఎస్సెస్ మెంట్లకు ఎరియర్ (పాత బకాయిల వడ్డీ) రూ. 3.84 కోట్లు, డిమాండ్ రూ. 11.27 కోట్లతో కలిపి మొత్తం రూ. 15.11 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు ఎరియర్ రూ.1.19 కోట్లు, పన్ను రూ. 6.84 కోట్లు మొత్తం డిమాండ్‌లో 53.17 శాతం రూ. 8.03 కోట్లు వసూలు చేశారు. గత ఏడాది రూ. 6.77 కోట్లు మాత్రమే వసూలయింది. తాడిగడప మున్సిపాల్టీలో 44,671 ఎస్సెస్ మెంట్లకు ఎరియర్ (ఆలస్యానికి వడ్డీ) రూ. 5.46 కోట్లు, ఆస్తి పన్ను డిమాండ్ రూ.15.24 కోట్లు కలిపి మొత్తం రూ. 20. 70 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా 67.43 శాతం వసూళ్లయ్యాయి. ఎరియర్ రూ.1. 91 కోట్లు, ఆస్తి పన్ను రూ.12. 05 లక్షలతో కలిపి రూ.13. 96 కోట్లు వసూలైంది.

జిల్లాలో నగరపాలక సంస్థ, మున్సిపాల్టీల్లో మొత్తం డిమాండ్ వసూళ్లు

మున్సిపాల్టీలు/ నగరపాలక సంస్థ	ఎస్సెస్‌మెంట్లు	డిమాండ్ రూ.కోట్లలో	వసూళ్లు రూ.కోట్లలో	శాతం
వైఎస్ఆర్ తాడిగడప	44,671	20.70	13.96	67.43
మచిలీపట్నం నగరం	48,272	15.11	8.03	53.17
గుడివాడ	26,258	11.21	7.40	66.02
వుయ్యూరు	9,900	4.00	2.55	63.81
పెడన	7,227	1.35	0.84	62.35
మొత్తం	**1,36,328**	**52.36**	**32.78**	**62.61**

భారంగా ఎరియర్స్

గత ప్రభుత్వం నగరపాలక సంస్థ, మున్సిపాల్టీల్లో ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని తీసుకువచ్చింది. ఇది భారంగా మారడంతో సామాన్యులు ఆస్తి పన్ను సకాలంలో చెల్లించలేకపోతున్నారు. ఆస్తి పన్ను బకాయిలకు ఎరియర్స్ (వడ్డీ)లు వసూలు చేస్తున్నారు. మొత్తం డిమాండ్‌లో ఇవి మూడో వంతుకుపైగా ఉంటున్నాయి. తాడిగడప మున్సిపాల్టీలో రూ.5.46 కోట్లకు రూ.1.91 కోట్లు, మచిలీపట్నం (మిగతా 2లో)

రిహార్సల్స్‌ను పరిశీలిస్తున్న ప్రభుత్వ కార్యదర్శి మీనా, కలెక్టర్ లక్ష్మీశ

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

ఏర్పాట్లు పరిశీలించిన ప్రభుత్వ కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా

ప్రజాశక్తి-విజయవాడ

ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 26వ తేదీన రాష్ట్రస్థాయి 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. శుక్రవారం స్టేడియంలో నిర్వహించిన ఫుల్ డ్రెస్ రిహార్సల్స్‌ను ప్రభుత్వ కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా, డిజిపి ద్వారకా తిరుమలరావు, డిఐజి బి.రాజకుమారి, ప్రోటోకాల్ డైరెక్టర్ మోహన్, నగర పోలీస్ కమిషనర్ బి.రాజశేఖర్‌బాబు, వివిధ శాఖల రాష్ట్రస్థాయి అధికారులు పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆదివారం ఉదయం ఉదయం 8.57 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, 8.58 గంటలకు గవర్నర్ అబ్దుల్ నజీర్ స్టేడియంకు చేరుకుంటారని తెలిపారు. ఉదయం 9 గంటలకు గవర్నర్ జాతీయ జెండాను ఆవిష్కరిస్తారని చెప్పారు. అనంతరం పోలీస్ పెరేడ్‌ను పరిశీలించి తిరిగి వేదిక వద్దకు చేరుకుని పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరిస్తారన్నారు. ఈ వేడుకల్లో వివిధ శాఖలు అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలపై రూపొందించిన శకటాల ప్రదర్శన ఉంటుందన్నారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ లక్ష్యం

- హెచ్ఐవి ఎయిడ్స్‌ను రూపుమాపుద్దాం
- ఐసిటిసి వాహనాలను ప్రారంభించిన మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ

ప్రజల ఆరోగ్య సంరక్షనే ప్రధాన లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలను చేపడుతున్నాయని, హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి పూర్తి వైద్య సహాయం అందించేందుకు రూ.3.60 కోట్ల ఖర్చుతో పది ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ టెస్టింగ్ సెంటర్ (ఐసిటిసి) వ్యాన్‌లను అందుబాటులోకి తీసుకొచ్చామని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఏపి స్టేట్ ఎయిడ్స్ కౌంట్రోల్ సోసైటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేసిన ఐసిటిసి మొబైల్ వాహనాలను సిద్ధార్థ మెడికల్ కళాశాల ప్రాంగణం నుండి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధిని సమూలంగా రూపు మాపేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. హెచ్ఐవి (మిగతా 2లో)

ఐసిటిసి వాహనాలను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్

స్తంభించిన మ్యాంగో మార్కెట్

- ఒప్పందం ప్రకారం కూలి ఇవ్వని వ్యాపారులు
- ప్రశ్నించిన కార్మిక నేతలపై పోలీసులకు తప్పుడు ఫిర్యాదులు
- నేతలకు అండగా పనులు నిలిపివేసి కార్మికుల ఆందోళన
- నేతలు, అసోసియేషన్ నాయకుల మధ్య చర్చలు నేటికి వాయిదా

ప్రజాశక్తి-విజయవాడ

ముందస్తుగా కుదుర్చుకున్న అగ్రిమెంట్ ప్రకారం కూలి ఇవ్వడం నిరాకరించడమే కాకుండా ఇదేమని అడిగిన నాయకులపై పోలీసులకు తప్పుడు ఫిర్యాదులు చేసిన స్థానిక కేథరేశ్వరపేట మ్యాంగో మార్కెట్ వ్యాపారుల వైఖరికి నిరసనగా ముఠా వర్కర్స్ యూనియన్ (సిఐటియు), ముఠా కార్మిక సంఘం (ఎఐటియుసి) ఆధ్వర్యంలో వందలాది మంది ముఠా కార్మికులు పనులను శుక్రవారం తెల్లవారుజాము ఉంచి స్తంభింప చేశారు. దీంతో చేసేది లేక అసోసియేషన్ నేతలు, కార్మిక సంఘాల నేతలతో పోలీసు అధికారుల సమక్షంలో సూర్యారావుపేట ఎడిసిపి కార్యాలయంలో శుక్రవారం రాత్రి చర్చలు జరిగాయి. బండిలో ఉంచి మరో బండికి సరుకు లోడింగ్ చేసినా, అలాగే సరుకుతో ఉన్న బండిని వేరే పార్టీకి పంపినా కార్మికులకు రెండు కూలీలు ఇవ్వాలని అసోసియేషన్ నేతలు చేసుకున్న ఒప్పందాన్ని సైతం కొందరు వ్యాపారులు గత మూడు మాసాల నుంచి అడపాదడపగా ఉల్లంఘిస్తూ...కార్మికుల శ్రమను దోచుకుంటున్నారు. గత మూడు మాసాల నుంచి పని భారం పెంచుతూ, కూలి తగ్గించే పనికి పలువురు వ్యాపారులు పాల్పడుతున్నారు. దీంతో పాటు గురువారం మార్కెట్‌లోని ఒక షాపు వ్యాపారి ఏకంగా ఏళ్ల తరబడి పని చేస్తున్న స్థానిక మార్కెట్‌లోని కార్మికులను పక్కన పెట్టేసి, ఈ పనితో సంబంధం లేని వ్యక్తుల సాయంతో ముఠా పని చేయించుకుంటున్నాడు. దీనిని ముఠా వర్కర్స్ యూనియన్ నేతలు అడ్డుకున్నారు. దీంతో వ్యాపారులు పోలీసులకు (మిగతా 2లో)

పనులు ఆపి నిరసన తెలుపుతున్న కార్మికులు

కార్మికులతో మాట్లాడుతున్న కార్మిక సంఘాల నేతలు

మొదటిపేజీ తరువాయి

స్తంభించిన మ్యాంగో మార్కెట్

ఫిర్యాదు చేయడం, దానిపై పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో...ఆగ్రహించిన కార్మికులు, తమ జీవనోపాధినే దెబ్బతీస్తూ, అడ్డగోలుగా వ్యవహరిస్తున్న వ్యాపారుల ఆగడాలు, బెదిరింపులు ఎక్కువయ్యాయి. గత కొంత కాలం నుంచి ఇదేమని అడిగే పరిస్థితి లేకుండా పోయింది. ఇటువంటి పరిస్థితుల్లో కార్మికుల పక్షాన ముఠా కార్మిక సంఘం నేతలు మ్యాంగో మార్కెట్ వ్యాపారుల అడ్డగోలు వ్యవహారంపై ప్రశ్నించి, కార్మికుల పక్షాన నిలబడ్డారు. దీనిపై జీర్ణించుకోలేని వ్యాపారులు ముఠా కార్మికుల నేతలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆగ్రహించిన ముఠా కార్మికులు...ముందస్తుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం కూలి ఇవ్వకపోగా, కార్మికులకు అండగా నిలిచిన యూనియన్ నేతలపై పోలీసులకు ఫిర్యాదు చేయడం ఏమిటని నిలదీస్తూ...మాంగో మార్కెట్‌లోని 150 షాపులకు పైగా ఉన్న 1200 మంది కార్మికులు శుక్రవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు పనులు మొత్తం బంద్ చేసి పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. మార్కెట్ కార్యకలాపాలు మొత్తం స్తంభించాయి. కార్మికుల న్యాయమైన ఆందోళనకు ముఠా వర్కర్స్ యూనియన్, ముఠా కార్మిక సంఘం, సిపిఎం, సిపిఐ, సిఐటియు, ఎఐటియుసి సంఘాలు సంపూర్ణ మద్దతు నిచ్చాయి. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి కాశీనాద్, విజయవాడ పశ్చిమ సిటీ కార్యదర్శి బోయి సత్యబాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, అధ్యక్షులు ఎ వెంకటేశ్వరరావు, ఎఐటియుసి నాయకులు ఎంసాంబశివరావు, వి నాగేశ్వరరావు, ముఠా కార్మిక సంఘం నగర కార్యదర్శి ఎం సీతారాములు, నాయకులు ఇవి నారాయణ, ఎఐటియుసి అనుబంధం ముఠా కార్మిక సంఘం నాయకులు శ్రీరాములు, సిహెచ్ పోలారావు తదితరులు కార్మికులకు మద్దతుగా నిలిచి ఆందోళనలో పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం సూర్యారావుపేటలోని ఎడిసిపి రామకృష్ణ కార్యాలయంలో శుక్రవారం రాత్రి సిపిఎం, సిపిఐ, ట్రేడ్ యూనియన్ల నేతలు, మార్కెట్ అసోసియేషన్ నేతలతో పోలీసు అధికారుల సమక్షంలో సుధీర్ఘంగా చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ కార్మికులకు న్యాయమైన కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. న్యాయబద్ధమైన రెండు కూలీలు ఇచ్చే ఒప్పందాన్ని అమలు చేయాలని కోరారు. ఏళ్ల తరబడి నడుస్తున్న ఒప్పందాన్ని కాదని, కార్మికుల శ్రమను దోచుకుంటూ...వారిని పలు రూపాల్లో ఇబ్బందులకు గురి చేస్తే సిపిఎం కార్మికుల పక్షాన పోరాడుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా వ్యాపారులు ఎటువంటి భేషజాలకు పోకుండా పెరిగిన ధరలకనుగుణంగా కూలి రేట్లు పెంచాలని కోరారు.

చర్చలు నేటికి వాయిదా

శుక్రవారం రాత్రి వరకు ఎడిసిపి కార్యాలయంలో జరిగిన చర్చలు ఒక కొలిక్కి రాకపోవడంతో శనివారం నాటికి వాయిదా పడ్డాయి. ఇప్పటికే అమలులో ఉన్న రెండు కూలీలు ఇవ్వాలనే పద్ధతిని అమలు చేయాలని కార్మికుల తరుపున కార్మిక సంఘాల నేతలు కోరడం, దానిపై వ్యాపారుల నుంచి సరైన స్పందన కనపడకపోవడంతో చర్చలు సఫలం కాలేదని కార్మిక సంఘాల నేతలు వెల్లడించారు. శనివారం ఉదయం 10.30 గంటలకు ఎడిసిపి కార్యాలయంలో మరలా చర్చలు జరుగుతాయని, ఆ సమావేశంలో కూలి రేట్ల పెంపుపై వ్యాపారుల నుంచి వచ్చే స్పందన ఆధారంగా కార్మికులు, కార్మిక సంఘాలు నిర్ణయాలు తీసుకోవచ్చునని, ఈ సందర్భంగా ఎడిసిపి రామకృష్ణ వెల్లడించినట్లు తెలిసింది. అయితే శుక్రవారం జరిగిన చర్చల సారాంశం, భౌష్యత్ కర్తవ్యంపై ఉదయం 10.30 గంటలకు మ్యాంగో మార్కెట్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం జరుగుతుందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, ఎఐటియుసి నాయకులు ఎం సాంబశిరావు, ఇతర కార్మిక సంఘాల నేతలు వెల్లడించారు.

కార్మికులకు మద్దతుగా సిపిఎం, సిపిఐ నాయకులు

పాఠ్యాంశాల్లో భాగంగా ఆటపాటలు

- సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు శ్రీనివాసరావు
- నేషనల్ స్కూల్ గేమ్స్ సెపక్ తక్రా టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆటపాటలు కూడా పాఠ్యప్రణాళికలో భాగం చేస్తున్నామని సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడ పటమట హైస్కూల్లో 68వ నేషనల్ స్కూల్ గేమ్స్ సెపక్ తక్రా అండర్-14 టోర్నమెంట్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడలను విద్యా ప్రణాళికలో భాగం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి క్రీడలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాలు క్రీడా పోటీల నిర్వహణకు టిఎస్‌ఆర్ ఫండ్స్ దాతల సహకారంపై ఆధారపడుతుంటే ఏపీలో క్రీడల నిర్వహణకు ప్రభుత్వం రూ.7.5 కోట్ల నిధులు కేటాయిస్తుందన్నారు. ఈ టోర్నమెంట్ క్రీడాకారుల్లో ప్రతిభను మెరుగుపరచడానికి ఉత్తమ వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. నాలుగు రోజుల పాటు అందరూ ఈ క్రీడా పండుగను ఆస్వాదించాలని పిలుపునిచ్చారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్న 12 రాష్ట్రాల క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. 'నేను క్రీడాభిమానిని, నేను సమగ్ర శిక్షా కార్యాలయం ఆవరణలోనే సిబ్బందితో షటిల్ బ్యాడ్మింటన్ ఆడతాను. నాకు క్రీడాకారులు అంటే చాలా ఇష్టం. ఈ నాలుగు రోజుల కార్యక్రమంలో మీరు ఎటువంటి సమస్య ఎదుర్కొన్నా నన్ను సంప్రదించండి. నేను అన్ని వేళలా అందుబాటులో ఉంటాను' అని వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన క్రీడాకారులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు యు.వి.సుబ్బారావు, సెక్రటరీ భానుమూర్తి పాల్గొన్నారు.

ఏర్పాట్లలో లోపం లేకుండా చూడాలి

ప్రజాశక్తి-విజయవాడ: 25న జాతీయ ఓటర్ల దినోత్సవం, 26న గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లలో ఎటువంటి లోపాలు జరగకుండా కట్టుదిట్టంగా చేయాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్ కోరారు. తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరుగుతున్న జాతీయ ఓటర్ల దినోత్సవం వేడుకల ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25న తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో, 26న మునిసిపల్ స్టేడియంలో జరుగుతున్న రెండు పెద్ద ఈవెంట్స్ అత్యంత ఘనంగా జరిగే విధంగా ఏర్పాట్లు ఉండాలన్నారు.

ఒత్తిళ్లు... వసూళ్లు

నగరంలో 3.84 కోట్లకు రూ.1.19 కోట్లు గుడివాడలో 2.29 కోట్లకు 52 లక్షలు, ఉయ్యూరులో 41 లక్షలకు రూ.2.15 లక్షలు, పెడనలో రూ. 29 లక్షలకు రూ. 6 లక్షలు వసూలు చేశారు. మొత్తం రూ.12.72 కోట్లలో రూ. 4.09 కోట్లు వసూలు చేశారు.

కృష్ణాజిల్లా వ్యాప్తంగా పన్నుల వసూళ్లలో పురోగతి కనిపిస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1,36,328 ఎస్సెస్‌మెంట్లకు ఎరియర్‌తో కలిపి రూ.52 కోట్ల 36 లక్షలు డిమాండ్‌కు గానూ 62.61 శాతం 32 కోట్ల 78 లక్షలు వసూలయ్యాయి. 2023-24లో ఈ సమయానికి వసూలైన మొత్తం రూ. 28 కోట్ల 72 లక్షలు. గతేడాదితో పోల్చుకుంటే 14.17 శాతం అధికం. జిల్లా కేంద్రం బందరు నగరపాలక సంస్థకు సమకూరే ఆదాయానికన్నా నూతనంగా ఏర్పాటైన వైఎస్‌ఆర్ తాడిగడప మున్సిపాల్టీకి అత్యధికంగా ఆస్తి పన్ను సమకూరడం గమనార్హం. పన్ను వసూళ్లలోనూ తాడిగడప ముందుంది.

ప్రజల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ లక్ష్యం

లక్షణాలు ఉన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధిగ్రస్తులకు పూర్తి వైద్య సహాయం అందించాలనే ఉద్దేశంతో ఐసిటిసి మొబైల్ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. మొబైల్ వ్యాన్‌లో వైద్య పరీక్షలకు అవసరమైన వైద్య పరికరాలతో పాటు ల్యాబ్ టెక్నీషన్, సిబ్బందిని నియమించడం జరిగిందని, మొబైల్ వాహనాలు నేరుగా ప్రజల వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తాయని తెలిపారు. టిబి, హెచ్ఐవి, కేన్సర్, కుష్టు, డయాబెటిస్ వంటి సంక్రమిత వ్యాధుల పట్ల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నామన్నారు. ప్రజల ముందుకే తీసుకువచ్చిన వాహనాల ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. ప్రజల జీవనశైలిలో మార్పులు రావాల్సి ఉందన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారం ప్రజల భాగస్వామ్యంతో మెరుగైన సమాజం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యం.టి.కృష్ణబాబు, ఏపిఎస్ఎసిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ డా. ఎ. సిరి, జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, ఏపిఎస్ఎసిఎస్ అడిషనల్ డైరెక్టర్ డా. సర్వసతి, జాయింట్ డైరెక్టర్లు డా. కామేశ్వ ప్రసాద్, డా. మంజూల, డా. భాగ్యలక్ష్మి, డా. శిరీష, డియంఅండ్‌హెచ్‌వో యం.సుహాసిని, జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ ఆఫీసర్ డా.జె.ఉషారాణి, సిద్ధార్థ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.అశోక్‌కుమార్, జిజిహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డిఎస్‌విఎల్ నరసింహం, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ కె.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF RELIGION

ULAVALAPUDI YESU PADAM S/o ANANDARAO(LATE), RESIDENT OF D.No:4-92, KONAYAPALEM VILLAGE,CHANDARLAPADU MANDAL, NTR DT, PIN CODE 521182, AP,

HAVE CHANGED MY RELIGION FROM HINDUISM TO CHRISTIANITY, FOR ALL PURPOSES WITH EFFECT FROM 10/05/2017.I HAVE CHANGED MY RELIGION ONLY.NOT MY NAME.

10వ తరగతి మార్కుల మెమో పోయినది

ఎన్‌టిఆర్ జిల్లా, వీరులపాడు మండలం, వెల్లంకి గ్రామ కాపురస్తుడు అమర్లపూడి రవికుమార్, తండ్రి : ఆనందరావు అను నా యొక్క 10వ తరగతి ఒరిజినల్ లాంగ్ మెమో పోయినది. 14-01-2025న వెల్లంకి గ్రామం నుండి నా 10వ తరగతి మార్కుల మెమో హాల్ టికెట్ నెం. 0127206 జిరాక్స్ నిమిత్తం వీరులపాడు లోని జిరాక్స్ షాపునకు వెళ్తుండగా దారిలో పోయినది. చుట్టుప్రక్కల వెతికినను దొరకలేదు. ఎవరికైనా దొరికిన యెడల వీరులపాడు పోలీస్‌స్టేషన్‌లో గానీ, క్రింది నా అడ్రస్‌కు తెలుపగలరు.

ఇట్లు
అమర్లపూడి రవికుమార్, తండ్రి : ఆనందరావు
వెల్లంకి, వీరులపాడు మండలం, ఎన్‌టిఆర్ జిల్లా.

మహారాజశ్రీ మొవ్వ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.యస్ నెం. 216/2019

బిట్వీన్ :
సంద్ర శ్యామ్ సుందరరాజు ....వాది
మరియు
బుట్టి పున్నం రాజు .... ప్రతివాది

రెస్పాండెంటు / ప్రతివాది :-
బుట్టి పున్నంరాజు, తండ్రి : అప్పలరాజు, హిందువు, వ్యాపారం, నివాసం : కోసూరు గ్రామం, మొవ్వ మండలం, కృష్ణాజిల్లా.

మీపైన పై కోర్టులో డబ్బులు వసూలు నిమిత్తం ప్రామిశరీ నోటుపై దావా ఓ.యస్.నెం. 216/2019 మరియు ఐ.ఎ. నెం. 115/2019ను ఇళ్ళ స్థలమును జప్తు కొరకు మీపై దాఖలు చేయగా శ్రీ కోర్టువారు మీకు ఓ.యస్.నెం. 216/2019 సమన్లు నిమిత్తం మరియు ఐ.ఎ. 115/2019 అను పిటీషన్‌లో నోటీసులు నిమిత్తం ది. 06-02-2025వ తేదీకి వాయిదా అయివున్నది. సదరు ది. 06-02-2025వ తేదీన ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట దావాలోను మరియు పిటీషన్‌లోను మీరు స్వయంగా కానీ, లేదా న్యాయవాది ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకో గలరు. లేనియెడల దావాలో మరియు పిటీషన్‌లోను మీ పరోక్షమున తీర్మానించ బడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేదీ : 06-02-2025

ఇట్లు
ఇమ్మడిశెట్టి లక్ష్మీనారాయణ,
న్యాయవాది, అవనిగడ్డ.
సెల్ : 9908160589.

పేరు మార్పు / సవరణ

నేను యర్రంశెట్టి నాగ వెంకట మదన్ మోహన్, నివాసం : డోర్ నెం.19-7-17, మెయిన్‌రోడ్డు, కంసాలిపేట, ఒన్‌టౌన్, విజయవాడ.

ఆధార్‌కార్డులో నా యొక్క పేరు ఎన్.వి.మదన్‌మోహన్ అని నమోదు చేయబడినది. ఇప్పుడు పేరు సవరణ చేయగా **యర్రంశెట్టి నాగ వెంకట మదన్ మోహన్ S/o యర్రంశెట్టి రంగారావు (YARRAMSETTY NAGA VENKATA MADAN MOHAN S/o YARRAMSETTY RANGA RAO)** గా మార్పు/సవరణ చేయటం జరిగినది. ఆధార్ మరియు భవిష్యత్ సవరణల కొరకు.

ఒరిజినల్ సర్టిఫికెట్లు పోయినవి

ఉయ్యూరు మండలం, ఉయ్యూరు నగర పంచాయితీ పరిధిలో గల పోస్టాఫీసు రోడ్డు, డో.నెం. 4-110/1 వాస్తవ్యులైన ఈడే వెంకటేశ్వరరావు గారి కుమార్తె ఈడే లక్ష్మి నర్సమ్మ అను నా యొక్క పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ సర్టిఫికెట్లు పోయినవి. పదవ తరగతి సర్టిఫికెట్ నెంబర్:0260119 ఇంటర్మీడియట్ సర్టిఫికెట్ నెంబర్:99-424/12615. నా సర్టిఫికెట్ లు 15 రోజుల క్రితం ఉయ్యూరు మెయిన్ సెంటర్లో పోయినవి. సదరు సర్టిఫికెట్ల కోసం నేను చాలా వెతికాను మరియు చాలా మందిని విచారించాను అయినను దొరకనందున, నేను ఉయ్యూరు టౌన్ పోలీస్ స్టేషన్ కార్యాలయపు అదికారుల వారిని నా సర్టిఫికెట్ వెతికించి ఇప్పించగలరని కోరుచున్నాను.

ఇట్లు
ఈడే లక్ష్మి నర్సమ్మ

పబ్లిక్ నోటీసు

ఇందుమూలంగా నా క్లయింట్స్ కొండపల్లి వీరజ భర్త : వేణుగోపాల్, హిందువు, వయస్సు 35 సం॥లు, డోర్ నెం. 61-13-5, కృష్ణవేణి వీధి, రామలింగేశ్వర నగర్, కృష్ణలంక, విజయవాడ. 2) మల్లంపల్లి నరేంద్ర, తండ్రి : వీరాంజనేయులు, హిందువు, వయస్సు 27 సం॥లు, డోర్ నెం. 1-32-50/2, ఉద్యోగనగర్ 1వ లైన్, ఎస్.వి.ఎస్. కాలనీ, గుంటూరు. వారి సంజాయిషీ పొంది ఈ పబ్లిక్ నోటీసు ద్వారా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ది.13-01-2025వ తేదీన నా క్లయింట్స్ విజయవాడ తాలూకా, గాంధీనగర్ ఎస్ఆర్‌ఒకు వెళ్ళి ఈ.సి.లు సర్టిఫైడ్ కాపీలు దరఖాస్తు చేసి తిరిగి ఇంటికి వచ్చి డాక్యుమెంట్లు సరి చూసుకొనగా డాక్యుమెంట్ నెం. 777/2019 మరియు 4210/2018 నున్న మరియు పటమట ఎస్ఆర్ఓలకు సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు కనపడకుండా పోయినవి. కావున సదరు డాక్యుమెంట్లు దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు. మరియు సదరు డాక్యుమెంట్స్‌ను ఉపయోగించుకొని ఎవరైనా ఏదైనా లావాదేవీలు జరిపిన యెడల అట్టి లావాదేవీలు మరియు క్లెయిమ్‌లు నా క్లయింట్స్‌ను ఏ మాత్రము బాధ్యులను చేయజాలవని తెలియజేయట మైనది.

విజయవాడ,
ది.25-01-2025

ఇట్లు
S.R.M. ఛాంబర్ ఆఫ్ లా
కిరణ్‌బాబు తగరం,
న్యాయవాది,
భారత్ గ్యాస్ ఆఫీస్ రోడ్డు, ఎల్ఐసి కాలనీ,
ఐటిఐ కాలేజీ ఎదురు, విజయవాడ.
సెల్ : 6300114939

ప్రకటన
మహారాజశ్రీ 14 అదనపు జిల్లా జడ్జి మరియు అదనపు ఫ్యామిలీ జడ్జి కోర్టు విజయవాడ
F.C.O.P. No. 61/2024

Between:
మల్లెమర్తి శ్రీ లత -పిటీషనర్
AND
అత్తిలి వీర మణికంఠ రవికుమార్ - రెస్పాండెంట్

రెస్పాండెంట్ అడ్రస్ :
అత్తిలి వీర మణికంఠ రవికుమార్, తండ్రి. నాగ మల్లేశ్వరా రావు, ఇంటి నెం. 1257, రాజీవ్ నగర్, పాయకాపురం, విజయవాడ, యన్.టి.ఆర్.జిల్లా.

ప్రతివాది పై ఈ నెంబరు పిటిషన్ లో మీరు ప్రతివాదియైన అత్తిలి వీర మణికంఠ రవికుమార్ మీకు అనేక సార్లు పై కోర్టు వారి నుండి దావా సమన్లు పంపిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారు ది. 28-03-2025 నకు వాయిదా వేసిఉన్నారు. కావున మీరు స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని సదరు కోర్టు వారి ఎదుట ది. 28-03-2025 న తేదీన ఉదయం గం.10.30.ని.లకు మీరు హాజరు కాగలరు. లేని యెడల సదరు దావాలో మీకు పరోక్షంగా తీర్మానించెదరని యిందు మూలముగా తెలియజేయదమైనది.

వాయిదా తేది: 28-03-2025

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం పేపరు పబ్లికేషన్ ద్వారా మీకు తెలియజేయటమైనది.

ఇట్లు
మల్లెమర్తి శ్రీలత,
భర్త A.V.M.K. రవి కుమార్,
R/o. పాయకాపురం,
విజయవాడ.

మాట్లాడుతున్న ముడా చైర్మన్ మట్టా ప్రసాద్, పక్కన కలెక్టర్, జేసీ

లేఅవుట్లకు ముడా నుండి అనుమతులు తప్పనిసరి

- ముడా చైర్మన్ మట్టా ప్రసాద్

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : మచిలీపట్నం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ సమావేశం ముడా చైర్మన్ మట్టా ప్రసాద్ అధ్యక్షతన, కో- చైర్మన్ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ లతో కలెక్టరేట్లో శుక్రవారం జరిగింది. ముడా పరిధిలో లేఅవుట్లకు ముడా నుండి నిబంధనల మేరకు తగిన అనుమతులు తప్పనిసరిగా పొందాలని,ముడా పరిధిలోని గ్రామాల్లో భవన నిర్మాణాలకు ఆన్లైన్ ద్వారా ముడా అనుమతులు పొందాలని, ముడా పరిపాలన భవనాన్ని నిర్మించేందుకు అవసరమైన స్థలం కేటాయించాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖ జాయింట్ సెక్రటరీ జె శివయ్య, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ టౌన్ ప్లానింగ్ రాజమండ్రి బి శ్రీనివాసమూర్తి, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం ఆర్ వెంకట్రావు,ముడా డిప్యూటీ కలెక్టర్ రవిశంకర్ పాల్గొన్నారు .

సిపిఎం అభిమాని మృతి

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటు మిల్లి మండలం మూలపర్రు గ్రామంలో సిపిఎం అభిమాని గౌరిశెట్టి కనకశానరావు (79) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమా రులు. భార్య అనారోగ్యం తో గతంలో చనిపో యింది. ఆయన రెండున్నర శతాబ్దాల పాటు సిపిఎం సభ్యునిగా పనిచేశారు. రైతాంగ పోరాటాల్లో ముఖ్యంగా బల్లగూడెం భూపోరాటంలో పాల్గొన్నారు. ఆయన మృతిపట్ల సిపిఎం బంటుమిల్లి మండల కమిటీ నాయకులు సంతాపం తెలిపారు.

సాయుధ దళాల పతాక నిధి సేకరణలో మూడవ స్థానం

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : సాయుధ దళాల పతాక నిధి సేకరణలో కష్ణాజిల్లా రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలిచిందని జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి సర్జన్ లెఫ్టినెంట్ కల్నల్ డాక్టర్ కే. కళ్యాణ వీణ శుక్రవారం తెలిపారు. ఇందుకు సంబంధించి డిసెంబర్లో రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా మెమెంటో తీసుకోవలసి ఉండగా, అనివార్య కారణాలవల్ల ఆ కార్యక్రమం రద్దు కావడంతో, ఆ మెమెంటోను శుక్రవారం కలెక్టరేట్లో జిల్లాకలెక్టర్ డీకే బాలాజీ అందజేశారు. ఈ సందర్భంగా డిపార్ట్మెంట్ ఆఫ్ సైనిక్ వెల్ఫేర్ 2025 కేలెండర్ కలెక్టర్ కు అందజేశారు.

పారిశుధ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : పారిశుధ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ డి కే బాలాజీ అధికారులను, శానిటేషన్ సిబ్బందిని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ శుక్రవారం ఉదయం స్థానిక 45, 46 డివిజన్లలో పర్యటించి ఇంటింటి చెత్త సేకరణ ఎలా జరుగుతున్నది పరిశీలించారు. చెత్త సేకరించే సమయంలో తడి /పొడి చెత్త వేరు చేయించి సేకరించాలని సిబ్బందికి సూచించారు. ఇంటింటి చెత్త సేకరణ జరుగుతున్నప్పటికీ రోడ్ల వెంబడి చెత్త ఎవరు వేస్తున్నారు, ఎందుకు వేస్తున్నారని, శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఈడేపల్లి చిన్న శక్తి గుడి రోడ్డులో రోడ్డు వెంబడి చెత్త, అపరిశుభ్రత పరిశీలించిన కలెక్టర్ శానిటేషన్ పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ప్రజలు తడి పొడి చెత్త వేరు చేసి శానిటేషన్ సిబ్బందికి అందించేలా వారిలో అవగాహన కల్పించాలన్నారు. ఎక్కువగా చెత్త వేస్తున్న గార్బేజ్ స్పాట్స్ గుర్తించి, ఎవరు వేస్తున్నారో తెలియడం లేదని, అట్టివారిని గుర్తించేందుకు అవసరమైతే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. నగరంలో డోర్ టు డోర్ చెత్త సేకరణ నూరు శాతం జరగాలని కమిషనర్ను ఆదేశించారు. నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గోపీచంద్, వార్డు ఇన్చార్జి పివి ఫణి కుమార్ మున్సిపల్ సిబ్బంది కలెక్టర్ వెంట ఉన్నారు .

చెత్తాచెదారం పరిశీలిస్తున్న కలెక్టర్ డికె బాలాజీ

జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ

ప్రతిభ కనపర్చిన క్రీడాకారులు

ప్రజాశక్తి-గన్నవరం : జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు జనవరి 19 నుండి 22 వరకు చత్తీస్‌గడ్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించినట్లు ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు మహేష్ తెలిపారు. జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ అమరావతి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ తరపున పోటీ చేసిన క్రీడాకారులు మహిళ విభాగం నుండి 34 మంది క్లోరీడాకారిణులు, పురుషుల విభాగం నుండి 39 మంది క్రీడాకారులు పాల్గొన్నారని,ఇందులో రాష్ట్రం నుంచి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ క్యాటగిరీలలో పాల్గొన్న క్రీడాకారులు ఉత్తమ ప్రతిభను ఘనపరిచి రాష్ట్రానికి మెడల్స్ తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా గన్నవరం నియోజకవర్గం కేసరపల్లి గ్రామానికి చెందిన ఈ శ్రావణ లక్ష్మి 69 కేజీల కేటగిరీలో బ్రాంచ్ మెడల్ సాధించినట్లు, అలాగే ఉమెన్ క్యాటగిరిలో సిహెచ్ కావ్య 43 కేజీ, బ్రాంజ్ మెడల్, మనీ 47 కేజీ కేటగిరిలో బ్రాంచ్ మెడల్, ఏ పూర్వజ 52 కేజీ కేటగిరిలో గోల్డ్ మెడల్, వందన 52 కేజీ కేటగిరిలో బెంజ్ మెడల్, 69 కేజీ క్యాటీరిలో పి శిరీష గోల్డ్ మెడల్ సాధించా రన్నారు. ఓవరాల్‌గా ఉమెన్ క్యాటగిరి ఛాంపియన్షిప్ రన్నర్స్ గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నిలవగా మెన్ క్యాటగి రిలో ఓవరాల్ ఛాంపియన్షిప్ సెకండ్ రన్నర్స్ గెలుపొందారన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-చల్లపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే వంట కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కషి చేస్తానని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు అన్నారు. తమ సమస్యల పరిష్కారానికి సహకారం అందించాలని కోరుతూ మధ్యాహ్నం భోజన పథకం కార్మికులు సురేష్ బాబుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ వంట కార్మికులకు పదివేల రూపాయలు గౌరవ వేతనం చెల్లించాలని, సంవత్సరానికి రెండుసార్లు పెరుగుతున్న ధరలను సమీక్షించి అందుకు అనుగుణంగా ఖర్చులను చెల్లించాలని,వంట గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వమే ఉచితంగా అందించాలని సురేష్ బాబు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ఎన్. వెంకటేశ్వరమ్మ, వేణుగోపాలమ్మ, నాగరాణి, అంజనాదేవి పాల్గొన్నారు.

ఆర్‌టిసి కార్గో సేవలు సద్వినియోగం చేసుకోండి : డిపిటిఒ

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి బస్టాండ్‌లో ఆర్టీసీ కార్గో సేవలను చుట్టుపక్క గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారిణి వి.వాణిశ్రీ కోరారు. శుక్రవారం చల్లపల్లి బస్ స్టేషన్‌లోని ఆర్టీసీ కార్గో కార్యాలయాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చల్లపల్లి, చుట్టుపక్కల గ్రామాల ప్రజల సౌకర్యార్థం స్థానిక ఈ కార్యక్రమంలో ఆర్టీసీ బస్టాండులో ఆర్టీసీ కార్గో, కొరియర్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన, వేగవంతమైన సేవలు ఆర్టీసీ కార్గో, కొరియర్ ద్వారా అందిస్తున్నామన్నారు. వ్యాపార సంస్థల యజమానులు, గ్రామ ప్రజలు ఆర్టీసీ కార్గో సేవలను వినియోగించు కోవాలని కోరారు. ఈమెతో పాటు జిల్లా అధికారి, కార్గో నిర్వాహకులు అహ్మద్ పాల్గొన్నారు

ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు పోరాటం

- జిల్లా సహకార బ్యాంక్ ఎస్‌సి,ఎస్‌టి ఉద్యోగుల సంఘం నాయకులు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లా సహకార బ్యాంక్‌లో ఉద్యోగుల పదోన్నతుల్లో ఎస్ సి, ఎస్టీ, బి సి- సి ఉద్యోగులకు న్యాయ జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని రాష్ట్ర అసోసియేషన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీలు రమేష్ , కె కుమార్ పాల్ లు అన్నారు. సహకార బ్యాంక్ లో ఉద్యోగులకు పదోన్నతులు ఇచ్చి ఏ విధమైన కారణాలు చెప్పకుండా తిరిగి వెనక్కి తీసుకోవడాన్ని నిరసిస్తూ ఎస్సి ఎస్టీ బి సి-సి వివిధ జిల్లా సహకార బ్యాంకు ఉద్యోగులు యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహకార బ్యాంక్ లో ఉద్యోగులకు పదోన్నతులు ఇచ్చి ఏ విధమైన కారణాలు చెప్పకుండా తిరిగి వెనక్కి తీసుకోవడం ఎస్సీ ఎస్టీ ఉద్యోగులు అవమానించినట్టేనని ఇలా చేయడం బ్యాంక్ సిఈఓ కి తగదన్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో ఎస్సీ ఎస్టీ ఉద్యోగులకు చిప్ మేనేజర్ ప్రమోషన్లలో జరిగిన పొరపాట్లను జిల్లా అదికారులకు పలుమార్లు సరిదిద్దమని పలుసార్లు వినతి పత్రాలు అందించిన ఉపయోగం లేకుండా పోయిం దన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిసిసిబిఏ నాయకులు కిషోర్, గోపినాథ్ ,యూనియన్ ప్రధాన కార్యదర్శి గౌతమ్ నాయక్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

కార్ల టైర్లు చోరీ : ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-కంకిపాడు : కార్ల డిస్కు, టైర్లు దొంగిలించే ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు గన్నవరం డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. కంకిపాడు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చలివేంద్రపాలెంకు చెందిన వల్లూరి బాలాజీ, పామర్రు మండలంకు చెందిన చింతపల్లి నరేంద్ర కుమార్‌లు కంకిపాడు మండలంలోని ఈడుపుగల్లులోని ఓషోరూంలో కొత్త కార్ల టైర్లు అలైవీల్స్, డిస్కులను దొంగిలించారు. వారి వద్ద నుంచి సుమారు 4 లక్షలు విలువైన 11 కార్లకు సంబంధించి 44 టైర్లతో పాటు, అలైవీల్స్ ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యహరించిన సీఐ మురళీకష్ణ, ఎస్ఐ సందీప్‌లను డిఎస్పి అభినందించి రివార్డులను అందజేశారు.

విశ్రాంత ఉపాధ్యాయులు గంగాధర్ మృతి

ప్రజాశక్తి-పమిడిముక్కల: మండలంలోని పమిడి ముక్కల శివారు పైడికొండలపాలెంలో విశ్రాంత ఉపాధ్యా యులు మైనేని గంగాధర్ (90) శుక్రవారం మృతిచెందారు. మండలంలోని లంకపల్లి, తాడంకి, కష్ణాపురం తదితర గ్రామాల్లో ఉపాధ్యాయ వత్తిలో కొనసాగి ఎంతోమంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారు. 1995 సంవత్సరంలో అమ్మినపురం పాఠశాలలో పదవి విరమణ చేశారు. గంగాధర్ మృతిపట్ల విశ్రాంత ఉపాధ్యాయులు విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు బండ్లపల్లి యోబు సంతాపం తెలిపారు. గంగాధర్ కుమారుడు మైనేని కోటేశ్వరావు పమిడిముక్కల కోపరేటివ్ బ్యాంకు అధ్యక్షులుగా చేసి పదవి విరమణ చేశారు. గంగాధర్ మృతిపట్ల పలువురు ఉపాధ్యాయులు, ప్రముఖులు సంతాపం తెలిపారు.

కోళ్ల వ్యర్థాల వాహనం పట్టివేత

ప్రజాశక్తి-గన్నవరం : బాపులపాడు మండలం వీరవల్లి వద్ద జాతీయ రహదారిపై హైద్రాబాద్ నుండి పెద్దపారపూడి వెళ్తున్న ఐచరు వాహనాన్ని తనిఖీ చేసి చేపలకు మేతకు తరలిస్తున్న 8 టన్నుల కోళ్ల వ్యర్థాలను శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఐచరు వాహనాన్ని వీరవల్లి గ్రామ వీఆర్‌ఓ సమక్షంలో వీరవల్లి లోని ప్రజలు ఎవ్వరు నివసించని ప్రదేశంలో కోళ్ల వ్యర్థాలను ఖననం చేశామన్నారు. వాహనాన్ని సీజ్ చేసి వీరవల్లి పోలీస్ స్టేషన్ కు తరలించి డ్రైవర్ పై కేసు నమోదు చేశామన్నారు.

ఆర్‌టిసి కార్మికుల నిరసన

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ డిపోలో కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలపై పలుమార్లు డిపో మేనేజర్కు వినతి పత్రం అందజేసినప్పటికీ స్పందించడం లేదంటూ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో డిపో కార్యాలయం ఎదుట శుక్రవారం యూనియన్ డిపో కార్యదర్శి ఎన్ మహేష్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అక్రమ పనిష్మెంట్లు వెంటనే రద్దు చేయాలని, తమకు నచ్చిన వారికి డ్యూటీలో బుక్ చేసి బస్సులను సకాలంలో డ్యూటీ కి ఇప్పించాలని, బస్సులు కండిషన్ మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు

మోపిదేవి ఆలయాన్ని సందర్శించిన తెలంగాణా అధికారులు

ప్రజాశక్తి-మోపిదేవి : తెలంగాణ రాష్ట్రానికి చెందిన హైదరాబాద్ రంగారెడ్డి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఉన్నతాధికారులు శుక్రవారం ఉదయం సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్నారు. నాగ పుట్టకు ప్రదక్షిణలు, గర్భాలయంలో ప్రత్యేక పూజలు, నాగవల్లి వక్షానికి ముడుపులు కట్టిన తర్వాత దేవాలయం ప్రాంగణం మొత్తం కలియతరిగి ఆలయ ప్రాముఖ్యత గురించి తెలుసుకున్నారు. కష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ గణేష్, మోపిదేవి కేడిసిసి బ్యాంక్ మేనేజర్ సయ్యద్ సల్మా తెలంగాణ అధికారుల బందాన్ని దేవాలయానికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు దర్శనం ఏర్పాట్లు చేయించారు. జనరల్ మేనేజర్ ప్రభాకర్ రెడ్డి ఫణి శ్రీరామ్, సీఈవో సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎల్‌బిఆర్‌సిఇ కళాశాలలో కల్చరల్ ఫెస్ట్

ప్రజాశక్తి - మైలవరం :

స్థానిక లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం లక్ష్య-2కె 25 (18వ నేషనల్ 11 టెక్నికల్, కల్చరల్ ఫెస్ట్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి వివిధ ఇంజనీరింగ్ కళాశాల నుండి సుమారు 1,500 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. వివిధ విభాగాల్లో విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

లే అవుట్లు వేసిన స్థలాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ జాహ్నవి

అక్రమ లేఅవుట్లను తొలగిస్తాం

ప్రజాశక్తి - కంచికచర్ల :

కంచికచర్ల పట్టణ శివారు ప్రాంతాలలో అనధికారికంగా ఏర్పాటుచేసిన అక్రమ లే అవుట్లను నోటీసులు ఇచ్చి వెంటనే తొలగిస్తామని కంచికచర్ల తహశీల్దార్ జాహ్నవి తెలిపారు. శుక్రవారం ఉదయం సిఆర్‌డిఎ అనుమతి లేకుండా అక్రమంగా లేఅవుట్లు వేసిన స్థలాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జాహ్నవి మాట్లాడుతూ కంచికచర్ల చుట్టుపక్కల గ్రామాల్లో, కంచికచర్ల పట్టణం చుట్టూ ఏర్పాటుచేసిన అక్రమ లేఔట్లను పరిశీలించినట్లు తెలిపారు. కంచికచర్ల ప్రాంతంలో ఎక్కువ శాతం అక్రమ లేఅవుట్లు ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని ఆమె తెలిపారు. అక్రమ లేఅవుట్లు వేసి ప్రజలను మోసం చేసి ఆ స్థలాలను అమ్మిన వారిపై క్రిమినల్ చర్యలు కూడా తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. అక్రమ లే అవుట్ వేసిన క్రియేటర్లు వాళ్లే స్వయంగా లేఅవుట్ ను తొలగిస్తే బాగుంటుందని లేకపోతే తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒ సురేష్ పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు త్వరగా ఇవ్వాలి

ప్రజాశక్తి - తిరువూరు :

ప్రభుత్వ ఆసుపత్రిలో డిశ్చార్జ్ అయ్యేలోపు పుట్టిన బిడ్డకు జనన ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేయాలని, ప్రయివేట్ ఆసుపత్రుల వారు పుట్టిన బిడ్డ సమాచారాన్ని మున్సిపాల్టీ కార్యాలయాల్లో తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలిచ్చినట్లు తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు శుక్రవారం తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో బిడ్డ పుట్టి డిశ్చార్జ్ అయ్యేలోపు బర్త్ సర్టిఫికేట్ జారీచేయాలని, ప్రయివేట్ ఆసుపత్రిలో బిడ్డ పుడితే మూడు దినాల్లో సమాచారాన్ని సంబంధిత పురపాలక సంఘ కార్యాలయాలకు పంపాలని చెప్పారన్నారు. ఆసుపత్రుల్లో ఎవరైనా మరణిస్తే మూడు రోజులలోపు మరణ ధ్రువీకరణ పత్రాన్ని జారీచేయవలసినదిగా తమను అదేశించారన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో సచివాలయ సిబ్బంది ద్వారా ప్రజలకు దీనిపై అవగాహన కల్పించాలని చెప్పారు. తిరువూరు నగర పంచాయతీ పరిధిలో గల అన్ని ప్రయివేటు, ప్రభుత్వ ఆసుపత్రుల వారికి కలెక్టర్ ఆదేశాలను తెలియజేస్తున్నామని చెప్పారు.

మీటా తగిలి యువకుడికి గాయాలు

ప్రజాశక్తి - జి.కొండూరు :

మండలంలోని గంగినేనిపాలెంలో వన్య ప్రాణులను వేటాడేందుకు పెట్టిన మీటా తగిలి అదే గ్రామానికి చెందిన పిట్ల నరేంద్ర కాలికి గాయమైంది. కొండ ప్రాంతానికి దగ్గరగా ఉన్న ఈ గ్రామంలో వన్యప్రాణులను ఎక్కువగా వేటాడుతున్నట్లు సమాచారం. శుక్రవారం అడవిలోకి మేకలు మేపేందుకు వెళ్లిన నరేంద్రకు ప్రమాదవశాత్తు ఈ మేట తగిలి గాయాలయ్యాయి. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

బాలికలకు సైకిళ్లు బహూకరణ

ప్రజాశక్తి - తిరువూరు : జాతీయ బాలికల దినోత్సవం, అంతర్జాతీయ విద్య దినోత్సవం సందర్భంగా భారతీయ స్టేట్ బ్యాంకు తిరువూరు మెయిన్ బ్రాంచ్ ఆధ్వర్యంలో తిరువూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన నలుగురు బాలికలకు సైకిళ్లను శుక్రవారం బహూకరించారు. ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ పి.రవి కుమార్ మాట్లాడుతూ బాలికల సర్వతో ముఖాభివృద్ధికి అందరూ సహకరించాలని, అందుకు బ్యాంకు సేవలు, సుకన్య సమృద్ధి, ఎన్‌పిఎస్ వాత్సల్య అర్‌డి వంటి సేవలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిజిఎం మనీశ్ కుమార్ సింగ్, ఎఒ రాఘవరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు, ఉపాధ్యాయులు, బ్యాంక్ సిబ్బంది కె.శ్రావణి, కె.గోపీనాథ్, ప్రసాద్, కె.సునీల్ కుమార్, డి.శ్రీను, భవాని, నిఖిత, బ్రహ్మం, పుల్లారావు, సత్యనారాయణ, రాఘవమ్మ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తులు అరెస్టు

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల పోలీసు స్టేషన్ పరిధిలో రెండు వేర్వేరు ప్రదేశాల్లో గంజాయి తరలిస్తున్న కేసులో 13 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద 10 కేజీల గంజాయి 2 బైక్‌లు, 8 సెల్‌ఫోన్‌లతో పాటు, ఒక కారును సీజ్ చేసినట్లు నందిగామ ఎసిపి ఎబిజి థిలక్ తెలిపారు. శుక్రవారం కంచికచర్ల పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిందితులను, స్వాధీనం చేసుకున్న గంజాయి, వాహనాలను మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందిగామ సబ్‌డివిజన్ పోలీస్ పరిధిలో గంజాయి తరలిస్తున్న ముఠాలపై గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో గంజాయి రవాణా కేసులలో ఉన్నవారిపై ఖచ్చితంగా నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కంచికచర్ల మండలంలో ఎక్కువగా ఇంజనీరింగ్ కళాశాలలున్నాయని, ఇక్కడ విద్యార్థులకు గంజాయి మూలాల లేకుండా చేస్తామని తెలిపారు. అదే సమయంలో గత వారం పదిరోజులు నందిగామ, చిల్లకల్లు పోలీసు స్టేషన్‌లో పరిధిలో దాదాపు ఐదు వందల కేజీల గంజాయిని, పలు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కంచికచర్లకు సంబంధించిన వివరాల ప్రకారం గురువారం సాయంత్రం పరిటాల శివారు ఒక రియల్ ఎస్టేట్ వెంచర్‌లో ఒక కారును ఆపి అనుమానాస్పదంగా ఉన్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరి వద్ద ఆరు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ గంజాయిని వారు చిన్న చిన్న పొట్లాలు కడుతున్నారన్నారు. ఈ కేసుకు సంబంధించి ఆరు కేజీల గంజాయి, ఒక కారు ఏడుగురు వ్యక్తులను ఆరు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం జుజ్జూరు రోడ్డులో వాహనాలను తనిఖీ చేపట్టగా రెండు బైక్‌లపై ఆరుగురు వ్యక్తులు పోలీసులను చూసి పరారయ్యేందుకు ప్రయత్నించారని, వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నాలుగు కేజీల గంజాయిని, రెండు ద్విచక్ర వాహనాలను, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ రెండు కేసులు పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.2.5 లక్షలు అని తెలిపారు. రెండు సంఘటనలకు సంబంధించి కేసులు నమోదు చేసి నిందితులను కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఎసిపి ఎబిజీ తిలక్‌తో పాటు నందిగామ రూరల్ ఇన్చార్జి సిఐ, నందిగామ సిఐ వైవిఎల్ నాయుడు, కంచికచర్ల, వీరులు పాడు ఎస్‌ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ముందుకు సాగని అభివృద్ధి

నాణ్యతలేని సిసి రోడ్లు, నాసిరకంగా డ్రెయినేజీలు

అపరిశుభ్రంగా ప్రభుత్వ కార్యాలయాల మరుగుదొడ్లు

తాగునీటికీ అష్టకష్టాలే - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండి దుర్గంధం వెదజల్లుతుంది. శుక్రవారం మండల సర్వసభ్య సమావేశానికి వచ్చిన సర్పంచులు, ఎంపిటిసిలు బాత్‌రూమ్స్ దుస్థితి నివ్వెరపోయారు. దుర్గంధ వాసనతో ముక్కులు మూసుకున్నారు. బాత్‌రూమ్స్ పాచిపట్టి దుర్వాసన వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఒక బాత్ రూమ్‌లో పాడైన ట్యూబ్‌లు, ట్రేలు వేశారు. మండలానికి ఐదు కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయి. పలు గ్రామాల్లో ఎన్‌ఆర్‌జిసి నిధులతో సిసి రోడ్లు, డొంక రోడ్లు, డ్రెయినేజీలు వేస్తున్నారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యతా లోపాలున్నాయి. పనులు నాసిరకంగా జరుగుతున్నాయి. డొంక రోడ్ల నిర్మాణంలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతుందని ఆరోపణలున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులకు వాటాలు పంపకంలో అవగాహన ఉంది. కాంట్రాక్టర్లు పనులు నాసిరకంగా చేసినా అధికారులు చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. నందిగామ మండల పరిషత్ కార్యాలయంలో అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఇటీవల కాలంలో ఆడిట్ చేయటానికి ఆడిటర్ పెద్ద ఎత్తున మామూళు కోరటంతో అధికారులు, మండల కార్యాలయం సిబ్బంది ఎవ్వరూ ఎంతెంత ఇవ్వాలో వంతులు వేసుకుంటూ మల్లగుల్లాలు పడుతున్నారు. నందిగామ మండల పరిషత్ కార్యాలయంలో ఏ బిల్లు మంజూరు చేయాలన్న ప్రతి పనికి పర్సంటేజి ఇవ్వాల్సిందేనని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. అనధికారికంగా నిర్మించిన షాపులకు చేతులు మారుతున్నాయి. నందిగామ మండల పరిషత్ కార్యాలయం పరిధిలో 38 షాపులు వుండగా నెలకు రూ.13 నుండి 15 లక్షల రూపాయల పైబడి అద్దెలు రావాల్సి ఉండగా అధికారులు, సిబ్బంది మెతక వైఖరి వల్ల నెలకు లక్షా యాభై వేల కు మించి రావడం లేదని సమాచారం. మండల పరిషత్ జనరల్ ఫండ్స్ వినియోగంలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. బోర్లు రిపేరు అయినా పట్టించుకోరు. తాగునీటికి మొక్కుబడిగా నిధులు కేటాయిస్తుండటం పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ప్రతి ఎంపిటిసికి రూ.5 లక్షల చొప్పున నిధులు కేటాయించిన గ్రామాల్లో అభివృద్ధి పనులు ముందుకు సాగటం లేదు. నందిగామ మండల పరిషత్ అభివృద్ధి అధికారి చాలా నిజాయితీ పరుడుని చెప్పుకుంటున్న మండల పరిషత్ ప్రగతి ముందుకు సాగటం లేదు. కార్యాలయంలో అపరిశుభ్రంగా వున్న బాత్ రూమ్స్ బాగు చేయించడానికి ఎంపిడిఓ,ఎంపిపి సంతకాలు చేయటానికి పొంతన కుదరడం లేదని విమర్శలు వెల్లువెత్తాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయం బాగు చేయాలని, అవినీతికి కళ్లెం వేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - కంచికచర్ల :

రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా కంచికచర్ల మండలం కీసర టోల్ ప్లాజా ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహించారు. స్థానికులకే కాక టోల్ ప్లాజా మీదగా వెళుతున్న ప్రయాణికులకు కూడా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరం లక్ష్మి ఫౌండేషన్ హాస్పిటల్ చెందిన రాజారావు టోల్ ప్లాజా మేనేజర్ జయప్రకాష్ సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రదర్శనలో పాల్గొన్న బాలికలు

బాలికలు ధైర్యంగా ఉండాలి

ప్రజాశక్తి - గంపలగూడెం :

ప్రస్తుత కాలంలో బాలికలకు ఎదురవుతున్న లైంగిక వేధింపులు ఇతర సమస్యలపై ఎదుర్కొనే ధైర్యాన్ని తెచ్చుకోవాలని పలువురు ఐసిడిఎస్ కార్యకర్తలు పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకొని గంపలగూడెంలో కార్యకర్తలు ప్రదర్శన చేసి బాలికలకు అవగాహన కల్పించారు. ఎవరిని వారే కాపాడుకునే దిశగా ఎదగాలని వివరించారు.

కాజ్‌వేపై లైటింగ్ పనులు

ప్రజాశక్తి - వత్సవాయి : పెనుగంచిప్రోలులోని పెనుగంచిప్రోలు మున్నేరు కాజ్‌వేపై లైటింగ్ లేక ప్రజలు రాత్రి సమయంలో చాలా ఇబ్బంది గురవుతున్నారు. ఈ నేపథ్యంలో టిడిపి మండల అధ్యక్షులు చింతల సీతారామయ్య లైటింగ్ పనులు ప్రారంభించారు. శుక్రవారం ప్రారంభించిన ఈ పనుల్లో భాగంగా పాడైన పోల్స్‌ను తీసివేసి వాటి స్థానంలో కొత్తపోల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

గోవర్ధన్ అందజేసిన నగదును హెచ్‌ఎం శివప్రసాద్ కు అందజేస్తున్న చెన్ను రామకృష్ణ

సబ్‌జోన్ ఆటల పోటీలకు విరాళం అందజేత

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ నియోజకవర్గం స్థాయిలో తలకడదీవి గ్రామంలో జరుగుతున్న బాలుర సబ్ జోన్ ఆటల పోటీల బహుమతుల కోసం టిడిపి నాయకులు ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్ రూ 25000 విరాళంగా అందజేశారు. అవనిగడ్డ నియోజకవర్గం లో క్రీడల అభివృద్ధి కోసం ఇక్కడి వ్యాయామ ఉపాధ్యాయులు చేస్తున్న కృషి కారణంగా నియోజకవర్గ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారని వారిని ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో బహుమతుల కోసం ఈ విరాళాన్ని అందజేస్తున్నట్లు గోవర్ధన్ చెప్పారు. శుక్రవారం నాగాయలంక మండలానికి చెందిన ఉపాధ్యాయుడు చెన్ను రామకృష్ణ ద్వారా ఈ మొత్తాన్ని తలగడదీవి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి శివరాం ప్రసాద్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పిడి సుబ్బారావు పాల్గొన్నారు

చంద్రబాబుకు స్వాగతం

ప్రజాశక్తి-గన్నవరం : దావోస్ పర్యట ముగించుకొని ఢిల్లీ నుండి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్ర యానికి శుక్రవారం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు వచ్చారు. మంత్రులు కొల్లు రవీంద్ర, కందుల.దుర్గష్, అనగాని.సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే యార్లగడ్డ.వెంకట్రావు స్వాగతం పలికారు. హెలికాప్టర్‌లో ఉండవల్లిలోని సీఎం నివాసానికి బయల్దేరి వెళ్లారు.

28న అవనిగడ్డలో జాబ్ మేళా

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఈనెల 28న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి విక్టర్ బాబు, ఏపీ ఎస్ ఎస్ డి సి సంస్థ జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి పి సురేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ జాబ్ మేళాలో పెట్టిరో ల్యాబ్స్ లిమిటెడ్, వైఎస్‌కే ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్, నవత ట్రాన్స్పోర్ట్ వంటి కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు ఈ కంపెనీలలో గల ఉద్యోగాలకు పదవ తరగతి ఐటిఐ (ట్రిట్టర్స్ ఎలక్ట్రీషియన్స్) ఇంటర్ డిగ్రీ పూర్తి చేసి 18 నుండి 30 సంవత్సరాల లోపు వారు అర్హులని, 28న నిర్వహించబోయే జాబ్ మేళాకు హాజరైన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించిఉద్యోగాలకు ఎంపిక చేస్తామన్నారు.

కోడూరు మండలంలో కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి-కోడూరు : జిల్లా కలెక్టర్ డికే బాలాజీ కోడూరు మండలంలో ఆకస్మికంగా సుడిగాలి పర్యటన చేశారు. కోడూరు మండలం ఉల్లిపాలెం గ్రామంలోని సచివాలయం, ప్రాథమిక ఉన్నత పాఠశాల, అంగన్వాడి కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. అంగన్వాడి కేంద్రాలను పిల్లలకు బరువుల రికార్డులను పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఉన్నత పాఠశాల లోని విద్యార్థులకు ఉపాధ్యాయులుగా విద్యాబోధన చేశారు. విద్యార్థులను వివిధ సబ్జెక్టులలో పార్యాంశాలలోని ప్రశ్నలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజనాన్ని విద్యార్థితో కలిసి భోజనం చేసి పాఠశాల ప్రధానోపాధ్యాయులను ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. సచివాలయంలోని సిబ్బంది సమయం పాలన పాటించాలని తెలిపారు. సమయపాలన చేపట్టకపోతే కఠిన చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని రోగులకు సక్రమమైన వైద్యం అందించి అందించాలని కోడూరు ప్రాథమిక వైద్యశాల వైద్యులను సూచించారు. వైద్యశాలను రికార్డులను పరిశీలించారు. కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి చదువుతున్న విద్యార్థులను విద్యాబోధన చేశారు. రానున్న పబ్లిక్ పరీక్షల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణతను సాధించాలని సూచించారు.

విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేస్తున్న కలెక్టర్ డికె బాలాజీ

15వ రోజుకు చేరిన సమ్మె

నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పెనమలూరు : తాడిగడప మున్సిపాలిటీలో తడి పొడి చెత్త సేకరించే వ్యాన్ డ్రైవర్ల సమ్మె శుక్రవారంతో 15వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో డ్రైవర్లు యనమలకుదురు లాకులు సెంటర్లో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా పెనమలూరు మండల సిఐటియు మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ స్పందించి అధికారులతో మాట్లాడి వ్యాన్ డ్రైవర్లు జీతాలు వచ్చే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెనమలూరు మండల సిఐటియు నాయకులు ఎస్కే మస్తాన్వలి, పాల శీను, తడి పొడి చెత్త వ్యాన్ డ్రైవర్ల సిఐటియు అధ్యక్షులు ఎస్ నేరెళ్ల, తడి పొడి చెత్త డ్రైవర్ల సిఐటియు కోశాధికారి వి సురేష్, తడి పొడి చెత్త వాన్ డ్రైవర్ల సిఐటియు నాయకులు పి ప్రసాద్, ఎస్ సుధాకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి వెండి వస్తువులు బహూకరణ

ప్రజాశక్తి మోపిదేవి : మోపిదేవిలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి సాఫ్ట్ వేర్ ఉద్యోగి వెండి వస్తువులను బహుకరణగా అందజేశారు. మోపిదేవి మండలానికి చెందిన రెడ్డొతు మురళీకృష్ణ ఉద్యోగరీత్యా హైదరాబాదులో సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తూ స్థిరపడ్డారు. తన మొక్కుబడుల నిమిత్తం శుక్రవారం మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని దర్శించుకున్న అనంతరం డిప్యూటీ కమిషనర్, ఆలయ కార్యనిర్వాహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావుకు మురళీకృష్ణ ఒక లక్ష 8 వేల 400 రూపాయలు విలువ కలిగిన ఒక కేజీ రెండు గ్రాముల బరువు గల రెండు వెండి పాదుకలు, రెండు వెండి పళ్ళెములు, ఒక వెండి గ్లాసులను అందజేశారు. దాత మురళీకృష్ణను ఆలయ అర్చకులు విరూప్, మణిదీప్ లు శేష వస్త్రంతో సత్కరించి, ప్రసాదాలు అందించారు.

వెండివస్తువులు అందిస్తున్న మురళీకృష్ణ

గణతంత్ర వేడుకలకు ఎకెటిపిఎం పాఠశాల విద్యార్థికి ఆహ్వానం

ప్రజాశక్తి - గుడివాడ : ఢిల్లీలో జరిగే 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు గుడివాడ ఎకెటిపిఎం పాఠశాల విద్యార్థి సిరికి ఆహ్వానం వచ్చినట్లు గుడివాడ డివైఈవో పద్మారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా భారత ప్రభుత్వంచే ఎర్రకోట (ఢిల్లీ)లో ప్రతిష్టాత్మకంగా జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ఎన్‌సిసి విద్యార్థిని గోపిశెట్టి సిరి ఆంధ్ర, తెలంగాణ డైరెక్టరేట్ జూనియర్ వింగ్ నుండి ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. ఎన్‌సిసి ట్రూప్‌లో 4వ ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్‌లో సిరి పేరు నమోదు చేసుకోవడం, జూలై నెలలో జరిగిన రిపబ్లిక్ డే పెరేడ్ సెలక్షన్స్‌లో పాల్గొనే అర్హత సాధించినట్లు తెలిపారు. దాదాపు మూడు నెలలు గణతంత్ర క్యాంపులలో శిక్షణ తీసుకొని గణతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొనేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. సిరి ఉన్నతకి కృషి చేసిన ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం మున్సిపల్ గర్ల్స్ హై స్కూల్ అసోసియేట్ ఎన్‌సిసి అధికారిణి 2 అనురాధ, 4ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ బలేందర్‌సింగ్, బెటాలియన్ ఆడమ్ ఆఫీసర్ మేజర్ స్వాతి పాండే, ప్రధానోపాధ్యాయిని ప్రమీలరాణి, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ఎం.ఉమామహేశ్వరరావు పాఠశాల సిబ్బంది అభినందించారు.

గుడ్లవల్లేరు విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక వివి. ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్ కళాశాల ఎం ఫార్మసీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని మొహమ్మద్ మైమున్నీసా ఈనెల 22, 23వ తేదీలలో మంగళగిరిలోని నిర్మలా ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొని ప్రథమస్థానం సాధించింది. ఈ సదస్సులో నొప్పుల నుండి ఉపశమనం పొందడానికి వినియోగించే నిపోఫామ్, పారాసిటమాల్ ఔషధాల మోతాదును నిర్ణయించే పద్ధతులపై ఈ-పోస్టర్ను ప్రదర్శించి మొదటి స్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం లక్ష్మణరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సులో పలు కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొనగా ఫార్మస్యూటికల్ ఎనాలసిస్ విభాగంలో మైమున్నీసా విజయం సాధించినట్లు తెలిపారు. ఈ విజయం సాధించిన విద్యార్థినికి మొమెంటోతో పాటు ప్రశంసా పత్రం బహూకరించారని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థినిని అధ్యాపకులు అభినందించారు.

చేనేతల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో చేనేత రంగం సంక్షోభం లోకి వెళుతోందని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం కృష్ణాజిల్లా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు వాసా గంగాధరరావు, గోరు రాజులు అన్నారు. చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ఎన్నికల ముందు ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం కృష్ణాజిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు వారి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయం తరువాత చేనేత ప్రధాన వృత్తిగా ప్రసిద్ధి చెందిన చేనేత పరిశ్రమ పట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్పోరేట్ విధానాల వలన సంక్షోభంలో చిక్కుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. తత్ఫలితంగా చేనేత కార్మికులు ఆకలి చావులు, ఆత్మహత్యలకు బలవుతు న్నారని

ధర్నా చేస్తున్న దృశ్యం

న్నారు. కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం చేనేతపై జి.ఎస్.టి వేయటంతో చేనేత రంగం మరింత సంక్షోభంలోకి నెట్టబడిందన్నారు. అధికారంలోకి వస్తే చేనేత పరిశ్రమను రక్షిస్తామని, జిఎస్‌టి రీయింబర్స్మెంట్ అమలు చేస్తామని, 200 యూనిట్ల ఉచిత కరెంటు అమలు జరుపుతామని వాగ్దానం చేసిన కూటమి ప్రభుత్వ నేతలు పట్టించుకోవడంలేదన్నారు. చేనేత పరిశ్రమకు రక్షణ కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం చేనేతకు 2వేలు కోట్లు కేటాయించాలని, చేనేతపై జి.ఎస్.టి పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు పంచల.నరసింహారావు, . సిఐటియు నాయకులు టి.చంద్ర పాల్,సి హెచ్.జయరావు లు సంఘీ బావం తెలిపి మాట్లా డారు. ఈ ధర్నా లో జిల్లా కమిటీ సభ్యులు నందం చంద్రశేఖర్, వి. పేర్లింగం, జి నాగభూషణం, పలువురు చేనేత కార్మికులు పాల్గొన్నారు. అనంతరం చేనేత శాఖ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

క్రీడా దుస్తులు బహూకరణ

ప్రజాశక్తి-ఘంటసాల : గోగినేనిపాలెం శ్రీ ఎన్.జి.రంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువు తున్న క్రీడాకారులకు గోగినేనిపాలెం గ్రామ వాస్తవ్యులు అత్తలూరి గోపీచంద్ కుమారుడు అత్తలూరి సుధీర్ కుమార్ 20వేల రూపాయలు ఖరీదు చేసే క్రీడా దుస్తులను పాఠశాలలో చదువుతున్న క్రీడాకారులకు అందజేశారు. క్రీడా దుస్తులు బహుకరించిన దాతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ్మన వేణుగోపాలరావు పాఠశాల విద్యా కుటుంబం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

తమ్మన పిచ్చయ్య ధర్మసత్రం స్వాధీనం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం లోని స్థానిక బలరామునిపేటలో గల అతి పురాతన ధర్మసత్రమైన తమ్మన పిచ్చయ్య ధర్మసత్రాన్ని, శుక్రవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ స్వాధీనం చేసుకుంది. కృష్ణాజిల్లా ఇన్చార్జి ఎండోమెంట్స్ అసిస్టెంట్ కమిషనర్, మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం డిప్యూటీ కమిషనర్ డి. శ్రీరామ వరప్రసాదరావు సారధ్యంలో, రెవెన్యూ, పోలీస్ బలగాలు దేవాదాయ శాఖ కార్యనిర్వాహణాధికారి గోవాడ వెంకటకృష్ణా రావులు ఈ పురాతన ధర్మసత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ధర్మ సత్రం అన్యాక్రాంతం అవుతున్నందువల్ల దేవాలయ ధర్మాదాయ శాఖ స్వాధీన పరుచుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. భవిష్యత్తులో ఏ లక్ష్యంతో తమ్మన వారి సత్రం నిర్మించారో ఆ లక్ష్యంతోనే ఈ సత్యాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ సిబ్బంది,కార్య నిర్వహణ అధికారులు సమ్మెట ఆంజనేయస్వామి, టీవీవి మోహన రావు, ఆకుల కొండలరావు పాల్గొన్నారు.

నీటి ప్రవాహంలో పడి లారీ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ శివారు అనాసాగరం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ మెల్లంపూడి శంకర్ ప్రమాదవశాత్తు నీటి ప్రవాహంలో పడి మృతి చెందాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా మానకొండురు వద్ద రెండు రోజుల క్రితం జరిగింది. సేకరించిన సమాచారం మేరకు శంకర్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ రెండు రోజుల క్రితం మహారాష్ట్ర నుంచి తవుడు లోడు తీసుకుని హనుమాన్ జంక్షన్‌కు బయలదేరి మార్గం మధ్యలో కరీంనగర్ జిల్లా మానకొండురు వద్ద ఒక కాల్వ వద్ద ఆగాడు. కాల్వలో స్నానం చేసి వస్తుండగా కాలుజారి పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. ఈ నేపథ్యంలో సమీపంలో కొంతమంది ఈ ఘటన చూసి అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు గురువారం బాడీని గుర్తించారు. పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు గురువారం మధ్యాహ్నం అప్పగించారు. శుక్రవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలున్నారు.

ఛత్రపతి శివాజీ విగ్రహ నిర్మాణానికి వినతి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలో నిర్మించబోయే ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ నిర్మాణ ఏర్పాటు అనుమతి కొరకు జగ్గయ్యపేట నగర ప్రథమ పౌరుడు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రకు చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ నిర్మాణ ఉత్సవ కమిటీ, హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో వారిని కలిసి విగ్రహ ఏర్పాటు కొరకు వినతి పత్రం అందజేశారు. శివాజీ మహారాజు విగ్రహం తొర్రగుంటపాలెం చౌరస్తాలో ఏర్పాటు చేయాలని గతంలోనే తెలిపామన్నారు. ఈ కార్యక్రమంలో పుర ప్రముఖులు నకరికంటి నాగేశ్వరరావు, వేద కుమార్, కోర్ కమిటీ పబ్బతి నరేంద్ర, సంక భాస్కర్, అల్లి రవిచంద్, అశోక్, ఉత్సవ కమిటీ కటగాని నరసింహారావు, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు అంబులెన్స్ ఆగడాలను అరికట్టాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలో గల ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రయివేటు అంబులెన్సుల ఆగడాలు అరికట్టాలని సిపిఐ పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. యాక్సిడెంట్స్, ఎమర్జెన్సీ కేసులను మెరుగైన వైద్య సేవల కోసం జిల్లా కేంద్రమైన విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు అంబులెన్స్ ద్వారా తరలించాల్సి ఉందని, కాని ప్రభుత్వాస్పత్రి నుంచి కొందరు సిబ్బంది ప్రైవేటు అంబులెన్స్‌లను ప్రోత్సహిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు అంబులెన్స్ వారికి విజయవాడ, ఖమ్మం ప్రాంతంలో గల ప్రైవేటు ఆస్పత్రుల వారు వారికి పారితోషికాన్ని ఇస్తున్నట్లు తెలుస్తోందని అన్నారు. దీని వల్ల ప్రభుత్వ వైద్యశాల నుండి పేదలకు ఉచితంగా వైద్యం అందకుండా పోతుందన్నారు. అనంతరం జగ్గయ్యపేట పట్టణ సిహెచ్‌సి సూపరింటెండెంట్ ఆళ్ళ హరీష్‌కి వినతిపత్రం అందజేశారు. హరీష్ మాట్లాడుతూ దీనికి సంబంధించిన వివరాలు సేకరించి పరిశీలిస్తామన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిపిఐ పట్టణ నాయకులు మెటికల శ్రీనివాసరావు, వై.భాను తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

సిపిఎం కార్యకర్త వేలాద్రి మృతి

నివాళులర్పిస్తున్న నాయకులు (ఇన్‌సెర్ట్‌లో పాతచిత్రం)

ప్రజాశక్తి - తిరువూరు : భవన నిర్మాణ రంగంలో వందలాది మందిని వర్కర్స్‌గా, మేస్త్రులుగా తీర్చిదిద్ది మంచి గురువుగా తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్న సిపిఎం సీనియర్ కార్యకర్త మొగిలిపువ్వు వేలాద్రి(80) గురువారం మృతి చెందారు. తిరువూరు మునకుళ్ల రోడ్డులోని తన నివాసంలో అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందారు. ఆయనకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వేలాద్రి మృతదేహానికి సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు ఎస్.నాగేశ్వరరెడ్డి సిపిఎం పతాకాన్ని కప్పి సీనియర్ నాయకులు గొల్లపల్లి వెంకటరత్నం ఆ పార్టీ తిరువూరు పట్టణ కార్యదర్శి, మేకల నాగేంద్ర ప్రసాద్, నాయకులు ఎస్వీ భద్రం, పంతంగి శ్రీనివాసరావు, చప్పిడి సురేష్, బి.వెంకటేశ్వరరావు, ఎ.రవి, ఎం.ప్రకాశరావు, వై.సత్యనారాయణ, ఎస్‌కె నాగుల్ మీరా, ప్రజానాట్య మండలి నాయకులు ఎస్.వెంకటేశ్వర్లు పంతంగి తులసిరాణి, ఐద్వా జిల్లా నాయకులు ఎస్.కుమారితో కలిసి ఘనంగా విప్లవ జోహార్లు అర్పించారు. సిపిఎం రాష్ట్ర నాయకులు, తిరువూరు డివిజన్ పూర్వ కార్యదర్శి బి.అర్.తులసీరావు వేలాద్రి మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తన సందేశం ద్వారా తెలిపారు. 40 సంవత్సరాలుగా సిపిఎం సభ్యుడిగా కొనసాగారన్నారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పి.శ్రీనివాసరావు, హుసేన్, ఈసూబ్, కామాల రామారావు, మస్తాన్, వెంకటేశ్వరరావు, వైసిపి నేత కాలసాని నాగేశ్వరరావు తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళు లర్పించారు.

నేత్రదానం

కుమారుడు నరసింహారావు తండ్రి వేలాద్రి నేత్రాలను దానం చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తిరువూరు నాయకులు సహకారంతో విజయవాడ ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి నిపుణులు వేలాద్రి నేత్రాలను సేకరించారు. లయన్స్ క్లబ్ నేతలు కొమ్మినేని రాజేష్ ఖన్నా ఉన్నారు.

సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరి

నందిగామలో రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - నందిగామ : సురక్షిత ప్రయాణానికి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని నందిగామ డివిజన్ అధికారి ఎసిపి తిలక్ తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా నందిగామ పట్టణ శివారు వై.జంక్షన్ దగ్గర హెల్మెట్ లేకుండా ప్రయాణం చేసే వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎసిపి తిలక్ మాట్లాడుతూ చాలామంది ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించని కారణంగానే రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారని తెలిపారు. హెల్మెట్ లేని కారణంగా తలకు తీవ్ర గాయాలయ్యి ప్రాణాలు కోల్పోతున్నారని హెల్మెట్ ధరించడంతో కలిగే ప్రయోజనాలను వాహనాదారులకు వివరించారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించి రోడ్డుపై ప్రయాణం చేసి గమ్యానికి చేరుకోవాలని తెలిపారు. సిఐ వైవిల్ నాయుడు, నందిగామ బ్రేక్ ఇన్‌స్పెక్టర్ పూర్ణిమ మాట్లాడుతూ యువతకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపకూడదని తెలిపారు. రోడ్డుపై ద్విచక్ర వాహనం వస్తే తప్పనిసరిగా హెల్మెట్‌తోనే రావాలని తెలిపారు. అనంతరం మద్యం సేవించి, సీట్ బెల్ట్ లేకుండా వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. రోడ్డు నిబంధనల ప్రకారం వాహనదారులు విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నందిగామ పట్టణ ఎస్ఐ అభిమన్యు, ట్రాఫిక్ ఎస్ఐ నరేష్, పోలీస్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, సచివాలయ పోలీసులు పాల్గొన్నారు.

తైవాన్ ఎక్స్‌లెన్స్ యంత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఆవిష్కరణ, నాణ్యతలకు చిహ్నమైన తైవాన్ ఎక్సెలెన్స్(టిఈ), యంత్రాల పనిముట్లు, తయారీ సాంకేతికత కొరకు ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎం.ఈశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగ్నేయాసియాల ప్రీమియర్ ప్రదర్శన అయిన ఐఎంటిఈఎక్స్ 2025 ప్రదర్శన ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఈ నెల 23 నుండి 29 వరకు బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్ (బిఐఈసి)లో వీటి ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ ప్రదర్శనలో 13 ప్రముఖ తైవాన్ కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

ఓటరు నమోదు ఉత్తమ అధికారిగా ఆర్‌డిఒ బాలకృష్ణ

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ అసెంబ్లీ నియోజక వర్గం ఓట్లు నమోదులో ఉత్తమ ఓటు నమోదు అధికారిగా నందిగామ ఆర్‌డిఒ కె.బాలకృష్ణ అవార్డు అందుకున్నారు. ఉత్తమ ఓటు నమోదు అధికారిగా నందిగామ ఆర్‌డిఒ కె.బాలకృష్ణ అవార్డు అందుకోవడానికి అర్హులు కావటం పట్ల నందిగామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఎఎంసి చైర్‌పర్సన్ రేసులో కిలారు విజయబిందు

ప్రజాశక్తి - తిరువూరు :

2024లో టీడీపీ అధికారంలోకి వచ్చాక నామినేటెడ్ పదవులు జాతర కొనసాగుతోంది. ఇప్ప టికే పలు కార్పొరేషన్‌లకు నామినేటెడ్ పదవులను అధిష్టానం ప్రకటించింది. ఇటు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులను కూడా త్వరలో ప్రకటించనుంది. ఇందుకోసం ఇప్పటీకే ఆయా నియోజకవర్గాల నుంచి అధిష్టానం పేర్లను సేకరిస్తుంది. తిరువూరు మార్కెట్ కమిటీని ఒసి మహిళకు కేటాయించారు. దీంతో పోటీలో పలువురు నిలుస్తున్నారు. ఛైర్‌పర్సన్ రేసులో మాజీ జెడ్పీటీసీ, తిరువూరు నియోజకవర్గ తెలుగు మహిళాధ్యక్షురాలు కిలారు విజయబిందు పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. 2014-19లో తిరువూరు రూరల్ జెడ్పీటీసీగా విజయబిందుకు ప్రజల్లో మంచి పేరుంది. ఎలాంటి అవినీతి ఆరో పణలులేని వ్యక్తిగా ఆమె రాజకీయాల్లో కొనసాగుతున్నారు. తండ్రి కీలారు రమేష్ రోలుపడి గ్రామ మాజీ సర్పంచ్ పనిచేశారు. ప్రస్తుతం పార్టీ సీనియర్ నాయకుడిగా ఉన్నారు. ఉన్నత విద్యావంతురాలిగా ఆమె ప్రజలకు అందుబా టులో ఉంటూ సేవ చేస్తున్నారు. రైతు కుటుంబం లో పుట్టిన ఆమె రైతుల కష్ట నష్టాల ను దగ్గరిగా చూశారని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆమెకు పూర్తిగా అవగాహన ఉండటంతో మార్కె ట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా రైతులకు సేవ చేసే అవకాశం ఉంటుందని పార్టీ కార్యకర్తలు చెబుతున్నారు.

ఉరుసు ఉత్సవాలకు ఆహ్వానం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని బలుసుపాడు రోడ్డులో గల హజరత్ సయ్యద్ దావూద్ షా వలీ దర్గా వద్ద శనివారం జరిగే గంధం ఉరుసు ఉత్సవాలకు అతిథిగా రావలసిందిగా జిల్లా జనసేన అధ్యక్షులు సామినేని ఉదయభానుని షేక్ రహమతుల్లా, జనసేన మైనారిటీ నాయకులు షేక్ సత్తార్, దర్గా చైర్మన్ షేక్ ఖాజా ఆహ్వానించారు.

మునగచర్లలో పశువైద్య శిబిరం

ప్రజాశక్తి - నందిగామ :

నందిగామ మండలం మునగచర్ల గ్రామంలో శుక్రవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు టీకాలు వేశారు. మినరల్ మిక్చర్, ఆలుశం పౌడర్ పంపిణీ చేశారు. మునగచర్ల గ్రామ సర్పంచి పొంగులూరి నరసింహయ్య, నందిగామ సబ్ డివిజన్ పశువైద్య అధికారి వెస్లీ, పశు వైద్యులు వెంకట్రావు, చంద్రశేఖర్, వీర బాబు తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో పరిటాల రవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తంగిరాల సౌమ్య

పరిటాల రవి వర్ధంతి

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణం కాకాని నగర్ టిడిపి కార్యాలయంలో శుక్రవారం టిడిపి సీనియర్ నాయకులు, మాజీ మంత్రి కీర్తిశేషులు పరిటాల రవి వర్ధంతి నిర్వహించారు. పరిటాల రవి చిత్రపటానికి ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పూలమాల వేసి నివాళులు అర్పించారు.

కంచికచర్ల : మాజీ మంత్రి పరిటాల రవి 20వ వర్ధంతి సందర్భంగా కంచికచర్ల స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం మండల టిడిపి అధ్యక్షులు కోగంటి బాబు తదితర నాయకులు నివాళు లర్పించారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన పరిటాల రవి చిత్రపటానికి వేరు పూలమాలలు వేసి ఆయన తెలుగుదేశం పార్టీకి చేసిన సేవలు గురించి కొనియాడారు.

మైలవరం : టిడిపి కార్యాలయంలో పరిటాల రవి వర్ధంతిని నిర్వహించారు. పరిటాల రవి చిత్రపటానికి స్థానిక ఎంఎల్ఎ కార్యాలయం ఇన్చార్జి నాగమల్లేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మైలవరం నియోజకవర్గ అధ్యక్షులు లంక లితీష్, చారుగొండ్ల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు మండలంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఆడపిల్లలు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ ముందంజ వేయాలని కృష్ణా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె వి రామ కృష్ణయ్య అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శుక్రవారం పాండురంగ హై స్కూల్, చిలకలపూడి లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా మహిళా, శిశు క్షేమ శాఖ, జిల్లా వైద్య శాఖ, జిల్లా వైద్యశాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ బాలి కల దినోత్సవం నిర్వహించారు. జిల్లా వైద్య శాఖ అధికారిణి. శర్మిష్ఠ , సిడిపిఓ గ్లోరీ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ :** బాలికలు ఎవరి సహాయం కోసమో ఎదురు చూడకుండా స్వశక్తితో ఎదుర్కోవాలని, ఆ దిశగా అడుగులు వేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రధాన ఆచార్యులు ఆచార్య ఎన్ ఉష మాట్లాడారు. అనంతరం ఎం ఎస్ ఎస్ విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎం శ్రావణి ప్రతిజ్ఞ చేయించారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** గుడ్లవల్లేరు లో గుడివాడ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థినిలకు బాలికల అభ్యున్నతికి తోడ్పడే విషయాలను సూపర్వైజర్ వాణి వివరించారు. అనంతరం విద్యార్థినిలతో ర్యాలీ నిర్వహించారు. అలాగే స్థానిక శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలలోని బాలికలు సంతరోడ్డులో ప్లే కార్డులు ప్రదర్శించారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు :** పొట్టిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో గన్నవరం సిడిపిఓ పి వెంకటలక్ష్మి పాల్గొని మాట్లాడారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బాల్య వివాహాల వల్ల అనర్ధాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్ధులందరి చేత బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. **ప్రజాశక్తి-గన్నవరం :** బాపులపాడు మండలం వీరవల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ వర్కర్లు, ఏఎన్ ఎంలు, ఎంఎస్ కేలు ఆధ్వర్యంలో కిషోర వికాసం పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నిర్మల, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే గన్నవరం మండలం వీరపనేని గూడెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వ్యాసరచన పోటీలు,బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం వెంకటేశ్వరమ్మ, అంగన్వాడి వర్కర్లు ఎం రమాదేవి, కే రాణి, పి అంజన, బి లక్ష్మి పాల్గొన్నారు.

ఘంటసాలకు చారిత్రక గుర్తింపునకు కృషి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-ఘంటసాల : చారిత్రక వారసత్వ గ్రామంగా ఘంటసాలకు గుర్తింపు తెచ్చేందుకు కృషి చేస్తామని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఘంటసాలలో ప్రాచీన బౌద్ధ స్థూపం వద్ద ధమ్మ ధజ బంతేజీ ఆధ్వర్యంలో గౌతమ బుద్ధునికి ప్రత్యేక పూజలు, స్థూప ప్రదక్షిణ, సధమ్మ ఉపోసత క్యాలెండరు, బౌద్ధ బోధనల కరపత్రం ఆవిష్కరణ చేసారు. అనంతరం 120 మంది విద్యార్థులకు సత్ప్రవర్తనపై అవగాహన కలిగించి ధ్యాన సాధన చేయించారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో అన్ని రుగ్మతలకు మందు బౌద్ధ ధర్మం అన్నారు. దివిసీమకు ఉన్న చారిత్రక వారసత్వ సంపద మరే ప్రాంతానికి లేదన్నారు. దివిసీమ మహోన్నత చరిత్రను యువత, విద్యార్థులు అందిపుచ్చుకుని భవిష్యత్ చరిత్ర నిర్మాతలు కావాలన్నారు. జన్మభూమిని మరువకుండా స్వగ్రామానికి సేవ చేస్తున్న గొర్రెపాటి రంగనాథబాబు సేవలు స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ, గొర్రెపాటి వెంకట్రాయులు - ఉదయ భాస్కరమ్మ ట్రస్ట్ చైర్మన్ గొర్రెపాటి రంగనాథబాబు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకష్ణ, మానవ హక్కుల సంఘం జాతీయ నాయకులు పిసుపాటి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

గుర్రపు డెక్కను వెంటనే తొలగించాలి : సిపిఎం

గుర్రపు డెక్క చూపిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-చల్లపల్లి : మొవ్వ మండల పరిధిలోని వేములమడ గ్రామంలో చెరువులో అల్లుకు పోయిన గుర్రపు డెక్కను తొలగించాలని మొవ్వ మండల సిపిఎం కార్యదర్శి శీలం నారాయణ రావు డిమాండ్ చేశారు. శుక్రవారంపార్టీ సభ్యులతో కలసి చెరువును పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు తాగునీటికి, పరిశుభ్రం చేయటానికి ఉపయోగించే చెరువు గుర్రపు డెక్క ఆవరించటంతో నీరు కలుషితమైం దన్నారు. ఈ నీటిని తాగిన పశువులు చర్మవ్యాధులు, గర్భకోశ వ్యాధులకు గురవుతున్నాయన్నారు. లేగ దూడలకు ఒళ్లంతా పొక్కులు తదితర వ్యాధులకు గురై ఎదుగుదల లేదన్నారు. పాడి పశువులలో పాలు దిగుబడి తగ్గటంతో రైతాంగం ఆందోళన చెందుతున్నారని అన్నారు. జనవరిలో సంక్రాంతి ముందు గ్రామ సచివాలయం లో జరిగిన స్పందన కార్యక్రమంలో అధికారులకు సంతకాలతో కూడిన అర్జీని రైతులు సమర్పించినా స్పందన కరువైందని విచారణ వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుర్రపు డెక్క తొలగింపునకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు జన్ను నాగేశ్వరావు, బొల్లా సుబ్రహ్మణ్యం, నూకల వెంకటేశ్వరరావు, రాధాకష్ణమూర్తి, గొల్లపూడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సబ్ జోన్ క్రీడలు ప్రారంభం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో శుక్రవారం బాలుర సబ్ జోన్ క్రీడలు ఉత్సాహంగా ప్రారంభమైయ్యాయి. పోటీల సీనియర్ ఖోఖో కోర్ట్ ను బాలుర ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు గొట్టం వెంకట రవి బాబు ప్రారంభించగా, వాలీబాల్ కోర్ట్ ను వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కే వి ఆర్ కిషోర్ ప్రారంభించారు. ఎనిమిది క్రీడాంశాలకు సంబంధించి గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల నుండి సుమారు 350 మంది బాలురు పోటీలలో పాల్గొన్నారు. కృష్ణా జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి సిహెచ్. చంద్రశేరరావు, సంఘం అధ్యక్షులు పి. వెంకటేశ్వరావు, ఉపాధ్యక్షులు బి యస్. రామచంద్రుడు,సబ్ జోన్ కార్యదర్శి యస్. వెంకటేశ్వరావు, సలహాదారుడు యస్. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో, షటిల్ బాడ్మింటన్‌లో విజేతలు గన్నవరం హైస్కూల్

సబ్ జోన్ బాలుర ఆటలు పోటీల సీనియర్స్ విభాగం ఖోఖో, షటిల్ బాడ్మింటన్ లో గన్నవరం బాలుర హైస్కూల్ జట్లు విజయ దుందుబి మోగించి విజేతగా నిలిచాయి. అలాగేఖో ఖో ద్వితీయ స్థానం శ్రీ సాయి శ్రీనివాస స్కూల్ పెద్ద ఆవుటపల్లి, షటిల్ ద్వితీయ స్థానం ఆతుకూరు హైస్కూల్ సాధించాయి. వాలీబాల్ లో గొల్లనపల్లి హైస్కూల్ జట్టు ప్రధమ, రెమల్లె జట్టు ద్వితీయ స్థానము లో నిలిచాయి. టెన్నికాయిట్‌లో ప్రధమ స్థానం గొల్లనపల్లిహై స్కూల్, ద్వితీయ స్థానంలో మానికొండ హైస్కూల్ జట్లు నిలిచాయి.

మోగిలేశ్వర గుప్తాకు సన్మానం

ప్రజాశక్తి-చల్లపల్లి : కష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘ ఉపాధ్యక్షులుగా నియమితులైన విస్సంశెట్టి మోగిలేశ్వర గుప్తాని శుక్రవారం సన్మానించి చల్లపల్లి పట్టణ ప్రముఖులు, వ్యాపారస్థులు, విశ్రాంత డి.ఎస్.పి హరి రాజేంద్రబాబు, చల్లపల్లి సబ్ ఇన్స్పెక్టర్ సుబ్రహ్మణ్యం,జనసేన నాయకులు అడపా రాంబాబు, దుట్ట శివరాంప్రసాద్,గంగిశెట్టి బాబురాజేంద్ర, మడమల రంజిత్ కుమార్, మాటూరి సుబ్బారావు, ఆర్యవైశ్య ప్రముఖులు అభినందనలు తెలియజేశారు రాబోయే కాలంలో మరిన్ని పదవులు అధిరోహిస్తూ సమాజానికి మేలు కరమైన అనేక కార్యక్రమాలు చేయాలని అభిలాషించారు.

స్వచ్ఛ గుడివాడ రూపకల్పనకు సహకారం

ప్రజాశక్తి - గుడివాడ : స్వచ్ఛ గుడివాడ రూపకల్పనకు అన్ని రకాలుగా సహకారం అందిస్తామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అభ్యర్ధన మేరకు గుడివాడ విచ్చేసిన స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఏలూరురోడ్డులోని చెత్తను వేసే డంపింగ్ యార్డును అధికారులు, ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో కలసి పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్లు సమావేశంలో పట్టాభిరామ్ మాట్లాడుతూ గుడివాడలోని ప్రతి ఇంటి నుంచి వందశాతం చెత్తని సేకరించే కార్యక్రమం మరలా పూర్తి స్థాయిలో పునరుద్ధరిస్తా మన్నారు. తడి చెత్తని, పొడి చెత్తని వేరు చేసేలా పట్టణ ప్రజలకి అవగాహన కల్పిస్తామన్నారు. చంద్రబాబు దిశా నిర్దేశం మేరకు గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా వదిలి వెళ్లిన 85 లక్షల టన్నుల చెత్తని క్లియర్ చేసే పనిని ప్రధాన కార్యాచరణగా పెట్టుకుని ముందుకు వెళ్తున్నామన్నారు. ఇప్పటికే 50 శాతంకి పైగా చెత్తని క్లియర్ చేశామని అన్నారు. గుడివాడలో కూడా రెండు లక్షల టన్నుల చెత్తని వదిలి వెళ్లారని అందులో 50 వేల టన్నులు చెత్త క్లియర్ చేశామని, మిగతా పేరుకుపోయిన చెత్తని మేము పెట్టుకున్న టార్గెట్ ప్రకారం అక్టోబర్ 2 గాంధీ జయంతి స్వచ్ఛ దివస్ నాటికి పూర్తిగా నిర్మూలించే చర్యలకు శ్రీకారం చుట్టామన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఫైనాన్స్ మేనేజర్ విజయ్‌శేఖర్, మునిసిపల్ కమీషనర్ బి శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమీషనర్ శ్రీనివాసరరావు, స్టేడియం కమిటి ఉపాధ్యక్షుడు శ్రీనివాసరరావు పాల్గొన్నారు.

ఉషారామాలో టెక్నో కల్చరల్ ఫెస్ట్ ప్రారంభం

ప్రజాశక్తి-ఉంగుటూరు : విద్యార్థులు ఉద్యోగంలో రాణించడానికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని రిటైర్డ్ ఐపీఎస్ మండవ విష్ణువర్ధన్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని ఉషా రామా ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో రెండు రోజులు జరగనున్న జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ ఫెస్ట్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా సాంకేతిక కార్యక్రమాలు, సజనాత్మక పోటీలు, ప్రతిభ ఆధారిత సాంస్కతిక ప్రదర్శనలు లాంటి 31 పైగా స్టాల్స్‌తో అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సాంకేతిక సజనాత్మకత పోటీలకు నమోదు చేయించుకోగా 3450 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమం ప్రారంభ సందర్భంగా జరిగిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విష్ణువర్ధన రావు మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలంటే క్రమశిక్షణ, పట్టుదల, నిజాయితీ కష్టపడే తత్వం కలిగి ఉండాలని, తద్వారా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం సులభతరం అవుతుందని అన్నారు. టెక్నికల్ క్విజ్, పేపర్ ప్రెజెంటేషన్,జెట్ రాకెట్స్, టెక్నికల్ జామ్, టెక్నో థాన్ తదితర అంశాలపై మొదటి రోజు పోటీలు నిర్వహించారు. విజేతలకు కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం,ఐటిఎస్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ వై రవీంద్రనాథ్ నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐటిఎస్ సేల్స్ అండ్ మార్కెటింగ్ సిఎం జనరల్ మేనేజర్ వై రవీంద్రనాథ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జివికెఎస్ వి ప్రసాద్ పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో జాతీయ రహదారి భద్రతపై అవగాహనా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుడ్లవల్లేరు ఎస్సై ఎన్.వి.వి.సత్యనారాయణ పాల్గొని ఎస్.ఆర్.జి.ఈ.సి. బస్ డ్రైవర్లకు, క్లీనర్లకు అవగాహన కల్పించారు. రహదారుల వెంబడి ప్రయాణం చేసేటపుడు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటిస్తూ, ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ, ఇతరులకు ఎటువంటి ఇబ్బంది కలుగజేయకుండా ప్రయాణాన్ని సుఖవంతం చేసుకోవాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి. కోదండ రామారావు, బస్ సూపర్ వైజర్ కె.విజయకుమార్, డ్రైవర్లు, క్లినర్లు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి-మోపిదేవి : గ్రామాలలో ఉచిత పశు ఆరోగ్య వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని కొక్కిలిగడ్డ గ్రామపంచాయతీ సర్పంచ్ దిడ్ల జానకీ రాంబాబు అన్నారు. మోపిదేవి మండలంలోని కొక్కిలిగడ్డ గ్రామంలోని వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం వద్ద శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పశు వైద్యాధికారి నందకిషోర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిబిరాన్ని సర్పంచ్ రాంబాబు ప్రారంభించారు. నాగాయతిప్ప సర్పంచ్ గరికపాటి వెంకటేశ్వరావు, ఎంపీటీసీ సభ్యురాలు దిడ్ల రాణి, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, మాజీ సర్పంచ్ లు కేశాని శివుడు, కంచర్ల నిర్మల తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** గ్రామీణ ప్రాంతాలలో పాడి పరిశ్రమ ఎంతో ముఖ్యమని కష్ణాపురం పశువైద్యాధికారి ఈశ్వర్ అన్నారు. శుక్రవారం పమిడిముక్కల మండలంలోని కష్ణాపురం పశువైద్యశిభిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27వ తేదీన మేడూరు గ్రామంలో పశు వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, గొర్రెలు, మేకలకు ఇంజక్షన్లు వేస్తామని, రైతులు తప్పక ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు

మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు

డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎ.మోహన్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అరవై శాతం పైగా రహదారి ప్రమాదాలకు వాహనాల లోపాలు కారణం కాదని, మానవతప్పిదాల వల్లే మూడొంతుల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎ.మోహన్ అన్నారు. శుక్రవారం ఉదయం విజయవాడలోని ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్లో 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రోడ్డు భద్రతా వారోత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రహదారి నిబంధనలను పాటించకపోవడం వల్లే గత ఏడాది రాష్ట్రంలో 8 వేల 600 మంది రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందగా, జిల్లాలో 413 మంది హెల్మెట్ ధరించకపోవడం తదితర తప్పిదాల వల్ల ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. డ్రైవర్లను చైతన్యపరిచేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో లారీ యజమానుల సంఘం డ్రైవింగ్ స్కూలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ట్రాఫిక్ పోలీసు సబ్‌ఇన్‌స్పెక్టర్ నరేంద్రకుమార్ ట్రాఫిక్ నిబంధనలు పుస్తకాన్ని ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడుతూ డిసెంబర్ 19 నుంచి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వాహనదారులు హెల్మెట్ ధరించడంలో, సీటుబెల్టు పెట్టుకోవడంలో అవగాహన కలిగించామని చెప్పారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ అలీ మాట్లాడుతూ వాహనాలు నడిపే వారికి సరైన శిక్షణ అవసరమని, రహదారి భద్రతపై

రహదారి భద్రతా మాసోత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజలకు అవగాహన పెంపొందించేందుకు, ప్రాణం విలువ తెలియజేసేందుకు ఎంపికచేసిన మాల్స్, స్కూల్స్ దగ్గర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సభకు అధ్యక్షత వహించిన కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ సంఘం అధ్యక్షులు నాగుమోతు రాజా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నందున ప్రతి ఒక్కరు భద్రత విషయంలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. తమ సంఘం 1995 నుంచి పోలీసు, రవాణాశాఖలతో కలిసి రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తోందన్నారు. రోడ్డుభద్రతపై బుర్రకథ ఆకట్టుకుంది. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రధాన కార్యదర్శి అల్లాడ సత్యనారాయణ వందన సమర్పణ చేశారు.

పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు గెలుపునకు కృషి చేయాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : పిడిఎఫ్ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావు గెలుపునకు సమిష్టిగా కృషి చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సుందరయ్య అన్నారు. ఇబ్రహీంపట్నం కామ్రేడ్ వెలగా లక్ష్మణరావు భవన్‌లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం యుటిఎఫ్ నాయకులు రెడ్ స్టార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎ.సుందరయ్య మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక నిరుద్యోగ మహిళ పెన్షనర్ల సమస్యలపై నిరంతరం శాసన మండలి గళం విప్పి విద్యా మేధావి కె.ఎస్.లక్ష్మణరావు, కృష్ణ గుంటూరు పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మార్చిలో జరిగే ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా జరిగే మేధావుల ఎమ్మెల్సీ కెయస్.లక్ష్మణరావు నిరుద్యోగుల కోసం అనేక పోరాటాలు నిర్వహించిన ఉద్యమ చరిత్ర నేపథ్యం కలిగిన వ్యక్తి అని చెప్పారు. ప్రజారోగ్య వేదిక జిల్లా కన్వీనర్ జి.విజయ ప్రకాష్ మాట్లాడుతూ నిరుద్యోగ యువత పట్టభద్రులు ఉద్యోగులు ఉపాధ్యాయులు కార్మికులు మద్దతు తెలిపిన ఏకైక ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాత్రమే అని ఆయన గెలుపునకు ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ ఓటర్ పూనుకొని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. డిఎస్‌సి ప్రకటించాలని

మాట్లాడుతున్న సుందరయ్య

నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అనేక సదస్సులు సెమినార్ నిర్వహించి లక్ష్మణరావు నిరుద్యోగ యువత కోసం పనిచేశారని తెలిపారు. ఈ సన్నాహక సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస్, జెవివి జిల్లా అధ్యక్షులు వెనిగళ్ళ మురళీమోహన్, పూర్వ రాష్ట్ర నాయకులు సంజీవరెడ్డి, మండల అధ్యక్షులు ఆర్మ్ స్ట్రాంగ్, ఉపాధ్యక్షులు శ్యామ్ మాస్టర్, అమర్ నాయక్, సిఐటియు మండల నాయకులు ఎ.విఠల్‌రావు, వాసు దేవన్, కొండలరావు పాల్గొన్నారు.

కిడ్నాప్ అయిన బాలుడు కుటుంబానికి అప్పగింత

ప్రజాశక్తి - విజయవాడ : కిడ్నాప్ అయిన రెండేళ్ల బాలుడిని నాలుగు గంటల వ్యవధిలో కుటుంబానికి పోలీసులు ఛేదించారు. వివరాల ప్రకారం... ఏలూరుకు చెందిన ఒక మహిళ తన కుమార్తె చికిత్స నిమిత్తం 22న పాత ప్రభుత్వాస్పత్రికి వచ్చారు. ఆమె భర్త ముగ్గురు పిల్లలతో కలిసి ఆస్పత్రి వెయిటింగ్ హాల్లో ఉంటూ పాపకు చికిత్స అందిస్తుంది. ఈ నేపథ్యంలో వారికి కోడూరుకు చెందిన ఒక బాలిక పరిచయం అయ్యింది. శుక్రవారం మహిళ భర్త ఏలూరు వెళ్లాడు. వారికి పరిచయమైన బాలిక ఇదే అదునుగా వారి మూడో సంతానం అయిన బాలుడిని చాక్లెట్ కొనిస్తానని చెప్పి తీసుకువెళ్లింది. మహిళ బాబును వెతకగా కనిపించకపోయే సరికి పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ ఘటనపై గవర్నర్ పేట ఇన్‌స్పెక్టర్ వారి సిబ్బందితో కలిసి వెంటనే ఘటనాస్థలానికి చేరుకొని విచారించి పై అధికారులకు సమాచారం తెలిపారు. వెంటనే నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఈ ఘటనను తీవ్రంగా పరిగణించి వెంటనే దర్యాప్తు చేసి నిందితులను పట్టుకోవాలని ఇచ్చిన ఆదేశాల మేరకు డి.సి.పి.గౌతమీ షాలి సూచనలతో సౌత్ ఏసిపి బంగారు రాజు పర్యవేక్షణలో గవర్నర్ పేట ఇన్‌స్పెక్టర్ ఎ.నాగమురళి వారి సిబ్బందితో కలిసి పలు ప్రత్యేక బృందాలు

బాలుడిని తలిదండ్రులకు అప్పగిస్తున్న సిపి రాజశేఖరబాబు

ఏర్పాటు చేసి దర్యాప్తును ప్రారంభించారు. పాత గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రి సమీపంలోని సి.సి.కెమెరాలను పరిశీలించి అనుమానితురాలిని గుర్తించారు. మరో ప్రత్యేక బృందం సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా చేసుకుని అనుమానితురాలు ఉండే ప్రదేశాన్ని గుర్తించి ఇన్‌స్పెక్టర్, వారి సిబ్బంది కలిసి పటమట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్.టి.ఆర్. సర్కిల్ సమీపంలో అనుమానితురాలిని అదుపులోనికి తీసుకుని సదరు బాలిక వద్ద ఉన్న రెండు సంవత్సరాల బాలుడుని క్షేమంగా రక్షించి తల్లిదండ్రులకు అప్పగించారు.

డిగ్రీ ఫలితాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - మైలవరం : డిగ్రీ ఫలితాల్లో స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ ఇళ్ల రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణ యూనివర్సిటీ వారు నిర్వహించిన ఐదో సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో బిఎలో 90 శాతం, బికాం కంప్యూటర్ అప్లికేషన్‌లో 95 శాతం, బిఎస్‌సిలో 92 శాతం మార్కులు సాధించారన్నారు. మొత్తంగా కళాశాలలో 93 మంది విద్యార్థులకు గానూ 84 మంది పరీక్షలు రాయగా 90 శాతం ఫలితాలు సాధించామన్నారు. బిఎస్‌సి కంప్యూటర్ సైన్స్ ప్రవీణ వెబ్ ఇంటర్ఫేస్ డిజైనింగ్‌లో వందకు వంద మార్కులు సాధించగా, బి.స్రవంతి కెమిస్ట్రీలో 99 మార్కులు, సాధించారన్నారు.

హోటళ్లలో తనిఖీ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని పలు హోటళ్ళ లో మున్సిపల్ సిబ్బంది శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా కాకతీయ రెస్టారెంట్, వెంకట సాయి హోటల్, ఎన్ హోటల్, ఆంధ్ర కేఫ్ హోటళ్లలో తనిఖీ నిర్వహించగా, పాడైన, నిల్వ ఉన్న చికెన్, మటన్, పన్నీరు, మంచూరియాలను గుర్తించి, వాటిని వెంటనే చెత్త బుట్టలో వేశారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడిన, మళ్లీ పునారావృతం అయినా కఠిన చర్యలు తీసుకుంటామని యాజమానులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.రాంబాబు, శానిటేషన్ మేస్త్రీలు, వార్డు శానిటేషన్ కార్యదర్శులు, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : డాక్టర్ మోహనరావు మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్ ఆధ్వర్యంలో డాక్టర్ మామిడి శీతారామారావు కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఎస్ఎస్‌సి -2024లో 577/600 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన ఇరువురు విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. విద్యార్థులు ఎస్‌కె షఫీనా, ఉషారాణికి ఒక్కొక్కరికి రూ.2వేల ఆర్థిక సాయం, సర్టిఫికెట్లు, మెడల్స్, పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శీతారామారావు మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని, చిరుతిండ్లు మానివేసి, ఆరోగ్యవంతమైన ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం, చదువులో రాణించేందుకు పోటీ తత్వం పెంచుకోవాలన్నారు. తద్వారా వచ్చే సంవత్సరం ఎక్కువమంది బహుమతులు పొందాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంగళగిరి లక్ష్మి సుహాసిని మాట్లాడుతూ ప్రతిభా పాటవాలు ప్రదర్శించి బహుమానాలు పొంది ఇంకా ఉన్నత చదువుల్లో రాణించాలని సూచించారు. మంచి అలవాట్లతో ఎదగాలని ఆకాంక్షించారు.

కలెక్టర్‌కు చెక్కును అందజేస్తున్న దృశ్యం

హెచ్‌ఐఎల్‌సిఎస్‌ఆర్ ఫండ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా సికె బిర్లా గ్రూపునకు చెందిన హైదరాబాద్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (హెచ్‌ఐఎల్) అభివృద్ధి పనులకు సహకారం అందించడం అభినందనీయమని కలెక్టర్ లక్ష్మీశా అన్నారు. సిఎస్‌ఆర్‌ఫండ్‌లో భాగంగా రూ.5 లక్షల చెక్కును గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సంస్థ ప్రతినిధులు కలెక్టర్‌కు అందజేశారు. ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లిలోని సికె బిర్లా గ్రూపునకు చెందిన హెచ్‌ఐఎల్ అందించిన ఫండ్‌ను వివిధ అభివృద్ధి పనులకు ఖర్చు చేస్తామని కలెక్టర్ తెలిపినట్లు సంస్థ ప్రతినిధులు చెప్పారు. చెక్ అందజేసిన వారిలో హెచ్‌ఐఎల్ యూనిట్ హెడ్ ఎన్.లక్ష్మీకాంత్, మేనేజర్ అమన్ దీప్, కాలుష్య నియంత్రణ మండలి మేనేజర్ ఈఈ శ్రీనివాస్ ఉన్నారు.

ట్రూకాలర్ ఐఫోన్‌పై నూతన యాప్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రముఖ కమ్యూనికేషన్స్ ప్లాట్‌ఫార్మ్, ట్రూకాలర్, ఇప్పుడు ఐఫోన్ కొరకు అతిపెద్ద అప్డేట్‌ను అందించిందని సంస్థ రీజినల్ ఇన్చార్జ్ కె.కరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కొత్త అప్డేట్ ప్రతిచోట ట్రూకాలర్ స్పామ్, స్కామ్ బ్లాకింగ్ సామర్థ్యాలను ఐఫోన్ యూజర్స్‌కు అందిస్తుందని తెలిపారు. ఇది ఇప్పుడు తన ఆండ్రాయిడ్ ప్రత్యర్థితో సమానంగాఅన్ని రకాల కాల్స్‌ను గుర్తించే సామర్థ్యం కలిగి ఉందన్నారు. ఇది గోప్యత పరిరక్షణ విధానంలో లైవ్ కాలర్ ఐడీని అందించేందుకు ట్రూకాలర్ వంటి యాప్స్ కొరకు అభివృద్ధి చేయబడిన ఆపిల్ లైవ్ కాలర్ ఐడీ లుక్ అప్ ఫ్రేమ్, వర్క్ ద్వారా సాధ్యపడిందని తెలిపారు. వివరాలకు ఆపిల్ స్టోర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

27 నుండి ప్రత్యేక కార్యక్రమాలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఈ నెల 27 నుండి జీ తెలుగు ఛానల్‌లో ప్రత్యేక కార్యక్రమం ఉంటుందని ఛానెల్ ఇన్చార్జి కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తికరమైన కార్యక్రమాలను అందించే జీ తెలుగు సంస్థ నూతనంగా ఈ నెల 27న ఎన్నాళ్ళో వేచిన హృదయం పేరుతో ప్రత్యేక కార్యక్రమం అందిస్తున్నట్లు తెలిపారు. సోమవారం నుండి శనివారం వరకు ప్రతి రోజూ మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రసారం చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం
పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...
మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218
విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.